Follow: @ANNTELUGU
21-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 227 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సెప్టెంబర్ 20న మునిసిపోల్స్?

- సెప్టెంబర్ 7న నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్
- ఏపీ స్థానిక తేదీలపై ప్రచారం
- స్థానిక ఎన్నికలు సీరియస్ గా తీసుకున్న కూటమి సర్కార్
- యుద్ధం చేసైనా గెలవాలని జగన్ సూచన

**అమరావతి, మహా :** ఏపీ స్థానిక ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం సై అనగా, సెప్టెంబర్ 7న మునిసిపల్ , కార్పోరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలకానుందన్న ప్రచారం జరుగుతోంది. సెప్టెంబర్ 7న నోటిఫికేషన్, 20న పోలింగ్, 23న కౌంటింగ్ జరగనుందని, 28న జడ్పీటీసీ., ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుల కానున్నదని, అక్టోబర్ 11న పోలింగ్ జరగనుందని, ఈ దిశగా

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### ఆ వ్యాఖ్యలకు నాకు సంబంధం లేదు



- కుమార్తె వ్యాఖ్యలకు తల్లిని బాధ్యురాలిని చేయొద్దని విజ్ఞప్తి
- పీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

02

### పెన్షన్లు ఇవ్వలేరు కానీ ఫ్రీ స్కీమ్స్ ఇస్తారా?



- ఉచిత పథకాలపై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు..
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే ఎత్తివేతకు నిరాకరణ!

02

### విరాళాల దోపిడీకి రామమందిర ట్రస్ట్ సరిపోలేదా?



- పీఎం కేర్స్ నిధిపై ఖర్గే కీలక ప్రశ్నలు
- నిధిలో రూ.8,452 కోట్ల నిల్వపై ఆరా

02

# కవితే డిసైడ్ ఫ్యాక్టర్!

- 20 నుండి 30 నియోజకవర్గాల్లో ఇంపాక్ట్
- ఏ గవర్నమెంట్ రావాలో డిసైడ్ చేసేది కవితే
- గెలుపోటములను తారుమారుచేయగలదు
- వేణుస్వామి సంచలన ప్రిడిక్షన్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజకీయాల్లో తెలంగాణ రక్షణసేన చీఫ్ కవిత ఇంపాక్ట్ ను తేలిగ్గా తీసిపారేసేవారికి దిమ్మతిరిగే షాక్ తగులుతుందని, ఆమె ఇంపాక్ట్ ఎన్నికలపై పక్కాగా ఉంటుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో మాజీ ఎంపీ, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చుట్టూ మరోసారి రాజకీయ చర్చ ఊపందుకుంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కవిత.. రానున్న రోజుల్లో మరింత కీలకమైన రాజకీయ శక్తిగా ఎదిగే అవకాశముందని ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. కవిత రాజకీయ భవిష్యత్తుపై ఆయన చేసిన అంచనాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.కవిత ప్రభావం కేవలం ఒక నియోజకవర్గానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాదని.. ఆమె ఇంపాక్ట్ తెలంగాణ పాలిటిక్స్ పై బలంగా ఉంటుందని వేణుస్వామి తేల్చారు. 20 నుంచి 30 నియోజకవర్గాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఆమె రాజకీయ పాత్ర ఉండొచ్చని వేణుస్వామి సంచలన ప్రిడిక్షన్ వెల్లడించారు. కవిత ఇంపాక్ట్ కారణంగా కనీసం 20 నియోజకవర్గాల్లో గెలుపోటములు మారుతాయని, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం 5వేల ఓట్లను ఆమె ప్రభావితం చేస్తుందని.. ఫలితంగా గెలుపు లెక్కలు మారిపోతాయన్నారు. వేణుస్వామి లెక్కలు ఎక్కువసార్లు ఫలించగా, కొన్నిసార్లు తప్పాయి.

మిగతా 2వ పేజీలో



# కూల్చివేతలకు రంగం సిద్ధం..!

### స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు ఆదేశాలు జారీ చేసిన సీఎంసీ కమిషనర్..!

- ఖానామేట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34లో అక్రమ నిర్మాణాలపై కొరడా...!
- సిటీ ప్లానర్ ఆధ్వర్యంలో జరగనున్న కూల్చివేతలు..!
- నోటీసులు జారీ కావడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు..!
- కూల్చివేతల అనంతరం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బిల్డింగ్ ను సీజ్ చేయాలి...!
- ఫలించనున్న 'మహా పత్రిక' పోరాటం..!

02


ప్రభుత్వ భూమి @100 కోట్లు
22(ఏ)లో ఉన్నా ఆగని అక్రమ నిర్మాణాలు
సీఎం శాఖలోనే అరాచకమా..
ఖానామెట్ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో ప్రభుత్వ భూమి దురాక్రమణ...!

మహాలో వెలువడిన కథనాలు

ఖానామేట్ ప్రభుత్వ భూముల్లో నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగం సిద్ధమైంది. సర్వే నంబర్లు 11/33, 11/34లలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన గురువారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నోడల్ అధికారిని ఆదేశించారు. సిటీ ప్లానర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ భారీ కూల్చివేతల కార్యక్రమం కొనసాగనుందని టౌన్ ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే నోటీసులు జారీ కావడంతో అక్రమార్కుల గుండెల్లో వణుకు మొదలైంది. 22 ఏ నిషేదిత భూమిలో సుమారు 4 వేల చదరపు గజాలు, వంద కోట్ల విలువైన స్థలంలో భారీ బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారంటూ మహా పత్రిక చేసిన అక్షర పోరాటంతో అధికార యంత్రాంగం దిగొచ్చింది.



### జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడి ర్యాష్ డ్రైవింగ్

- ఇనార్బిట్ మాల్ ఎదురుగా కారుతో యువతిని ఢీకొట్టిన సంజూష్
- చికిత్సపొందుతూ యువతి మృతి.. కేసు నమోదు

03

### బావిలోకి దూసుకెళ్లిన కారు

- ఒకే కుటుంబంలో నలుగురు మృతి
- సిద్దిపేట జిల్లా దుబ్బాకలో విషాదం

02






### కేరళకు పవన్ కల్యాణ్

**20 రోజుల పాటు విశ్రాంతి**



**అమరావతి, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం నుంచి కేరళలోని ప్రముఖ ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో చేరనున్నారు. కొంతకాలంగా ఆయన వరుస రాజకీయ, పాలనాపరమైన కార్యక్రమాలతో తీవ్ర అలసటకు గురయ్యారు. ఇటీవలే పవన్ కల్యాణ్ భుజానికి శస్త్రచికిత్స కూడా జరిగింది. నాడీ వ్యవస్థ, శరీర ఆరోగ్య సమతుల్యత పునరుద్ధరణ కోసం కేరళ వైద్య కేంద్రంలో ప్రత్యేక థెరపీలు పొందనున్నారు. ఈ మేరకు కేరళలో 20 రోజుల పాటు పూర్తిస్థాయి విశ్రాంతితో పాటు ప్రకృతి సిద్ధమైన వైద్య చికిత్సలను పవన్ కల్యాణ్ తీసుకోనున్నారు. చికిత్స పూర్తి చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వచ్చిన తర్వాతే ఆయన మళ్లీ ప్రజా సేవ, డిప్యూటీ సీఎంగా తన నిత్య విధుల నిర్వహణలో ముమ్మరంగా పాల్గొననున్నారు.



# కూల్చివేతలకు రంగం సిద్ధం..!



**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్, హైటెక్ సిటీ-కూకట్‌పల్లి ప్రధాన రహదారిని ఆనుకుని బుట్టా కన్వెన్షన్ పక్కన ఉన్న ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై కూల్చివేత చర్యలకు రంగం సిద్ధమైంది.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం నడుం బిగించింది.నిషేధిత జాబితా 22(ఏ)లో నమోదైన ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సీఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) విభాగాలను రంగంలోకి దింపి, కూల్చివేతలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు. సిటీ ప్లానర్ పర్యవేక్షణలో కూల్చివేతల ప్రక్రియ కొనసాగనుందని వారు తెలిపారు. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ఖానామెట్ ప్రభుత్వ భూమిలో సుమారు 4 వేల చదరపు గజాలలో నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో అనేక ఫిర్యాదులు అందడంతో అధికారులు చర్యలకు ఉపాక్రమించారు .

ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన యంత్రాంగం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంది. భూమి రికార్డులు, నిషేధిత జాబితాలో నమోదైన వివరాలు, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను పరిశీలించిన అనంతరం అక్రమ నిర్మాణాలపై చర్యలకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సిటీ ప్లానర్ ఆధ్వర్యంలో యాక్షన్ ప్లాన్:**
అక్రమ నిర్మాణాల కూల్చివేత కోసం సిటీ ప్లానర్ పర్యవేక్షణలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఎస్‌టీఎఫ్, టౌన్ ప్లానింగ్, ఇతర సంబంధిత విభాగాల సమన్వయంతో కూల్చివేతలు చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్మాణాల వద్ద పరిస్థితిని పరిశీలించి, అవసరమైన యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగనివ్వకూడదని అధికారులు స్పష్టం చేశారు. చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి కూల్చివేతలు చేపట్టేందుకు చర్యలు వేగవంతం చేశారు.

**నోటీసులు జారీ కావడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు :**
అక్రమ నిర్మాణాలకు సంబంధించి సంబంధిత వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు జారీ అవడంతో అక్రమ నిర్మాణదారుల్లో ఆందోళన మొదలైనట్లు అక్రమార్కుల అనుచర వర్గాల నుండి వ్యక్తమవుతోంది. కూల్చివేతలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న దానిపై ఖానామేట్ లో ఉత్కంఠ నెలకొంది.

ఇప్పటివరకు నోటీసులు, ఫిర్యాదుల స్థాయిలో ఉన్న వ్యవహారం ఇప్పుడు క్షేత్రస్థాయి చర్యల దిశగా చేరుకోవడంతో అక్రమ నిర్మాణదారులకు గట్టి ఎదురుదెబ్బ తగలనుంది.

**కూల్చివేతల అనంతరం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు బిల్డింగ్ సీజ్ కి డిమాండ్:**
అక్రమ నిర్మాణాలను తొలగించిన అనంతరం ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. భవిష్యత్తులో తిరిగి ఆక్రమణలకు అవకాశం లేకుండా భూమిని రక్షించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కూల్చివేతలతో మాత్రమే ప్రక్రియను ముగించకుండా, అక్రమ నిర్మాణాలను సీజ్ చేయడంతో పాటు ప్రభుత్వ భూమిపై పూర్తి నియంత్రణ సాధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్ని కాపాడేందుకు అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

## ఫలించిన 'మహా పత్రిక' పోరాటం:

ఖానామేట్ ప్రభుత్వ భూముల వ్యవహారాన్ని 'మహా పత్రిక' నిరంతరం ప్రజల ముందుకు తీసుకువచ్చింది. సర్వే నంబర్లు 11/33, 11/34లో ప్రభుత్వ భూముల స్థితి, నిషేదిత 22 (ఏ) జాబితా, అక్రమ నిర్మాణాల వ్యవహారం, అధికారుల బాధ్యత వంటి అంశాలపై వరుస కథనాలు ప్రచురించింది. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ సుదీర్ఘంగా సాగించిన పత్రికా పోరాటానికి ఇప్పుడు అధికారుల చర్యలు బలాన్ని చేకూర్చాయి. సీఎంసీ కమిషనర్ ఆదేశాలతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దిగుతుండటం, సిటీ ప్లానర్ పర్యవేక్షణలో కూల్చివేతలకు కార్యాచరణ సిద్ధం కావడంతో ఖానామేట్ లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవనే స్పష్టత ఏర్పడింది. త్వరలోనే కూల్చివేతల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ భూముల పరిరక్షణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.




























**మహాలో వెలువడిన కథనాలు**
















**మహాలో వెలువడిన కథనాలు**

# కవితే డిసైడ్ ఫ్యాక్టర్!

(మొదటి పేజీ తరువాయి)



పొలిటికల్ ప్రిడిక్షన్ చేయడంలో వేణుస్వామి రూటే సపరేటు. 20-30 నియోజకవర్గాల్లో కవిత ప్రభావం ఉంటే.. అది ఎన్నికల ఫలితాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా హోరాహోరీ పోరు జరిగే నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడానే గెలుపోటములను నిర్ణయించే పరిస్థితులు ఉంటాయి. అలాంటి సమయంలో ఒక నేతకు ఉన్న వ్యక్తిగత ప్రభావం, సామాజిక వర్గాల్లో ఉన్న అనుసంధానం, రాజకీయ ప్రచారం వంటి అంశాలు ఫలితాలను మార్చగలవు. కవిత ప్రభావం పెరిగితే.. భవిష్యత్‌లో రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్న దానిపై కూడా ఆమె ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపే స్థాయికి చేరుకోవచ్చన్నది ఈ అంచనాల సారాంశం.

**కవిత వ్యూహాత్మకం**
కవిత భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కూడా ఆసక్తి నెలకొంది. ఆమె ఏ రాజకీయ అంశాలను ప్రధానంగా ముందుకు తీసుకెళ్తారు? ఎలాంటి రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తారు? పార్టీ అంతర్గతంగా, బయట రాజకీయంగా ఆమె పాత్ర ఎలా మారుతుంది? అన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో కవితకు ఉన్న పరిచయం, ప్రజా వేదికలపై ఆమె చురుకుదనం, మహిళా సమస్యలపై ఆమె చేసిన కార్యక్రమాలు, జాగృతి ద్వారా తెలంగాణ అంతా చుట్టేసిన తీరు ఆమెకు అభిమానులను తెచ్చిపెట్టింది. లిక్కర్ స్కామ్ లో తీహార్ జైలులో ఉండి వచ్చిన తర్వాత కవితలో పట్టుదల పెరగ్గా, బీఆర్ఎస్ పార్టీ ఆమెను సస్పెండ్ చేసింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కవిత సొంతపార్టీ పెట్టింది. కవిత పార్టీ అజెండా చర్చనీయాంశంగా మారగా, తెలంగాణ రాజకీయాల్లో కవిత ఇంపాక్ట్ పై వేణుస్వామి కామెంట్స్, ప్రిడిక్షన్ పెద్ద చర్చకు దారితీసింది. ప్రధానంగా మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్ నగర్ వంటి జిల్లాల్లో కవిత పార్టీ ఇంపాక్ట్ కనబడుతోంది. మహబూబ్ నగర్ , రంగారెడ్డి జిల్లాలతో పాటు సొంత జిల్లా నిజామాబాద్, మెదక్ లోనూ కవిత ఇంపాక్ట్ ఉంది. ఆదిలాబాద్ జిల్లాలోనూ పలువురు ముఖ్యనేతలు కవిత పార్టీలో చేరారు. తాజాగా కవితను విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడు రాధాపండిట్ కూడా కలిశారు. కేసీఆర్ కు ఇలాంటి వాటిపై నమ్మకం ఎక్కువ కాగా, కవిత కూడా అదేబాటలో పయనిస్తున్నారు.

# విరాళాల దోపిడీకి రామమందిర ట్రస్ట్ సరిపోలేదా?

**పీఎం కేర్స్ నిధిపై ఖర్గే ప్రశ్నలు**



**ఢిల్లీ, మహా :** అయోధ్య రామమందిర విరాళల చోరీ, పీఎం కేర్స్ నిధి వినియోగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నలు లేవనెత్తారు. పీఎం కేర్స్ నిధి, రామమందిర ట్రస్ట్ రెండూ ప్రధాని మోదీ పర్యవేక్షణలోనే ప్రకటించాయని, రెండింటికీ విరాళాలు అందుతాయని ఆయన తెలిపారు. పీఎం కేర్స్ ట్రస్ట్‌లో 2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను ప్రస్తావిస్తూ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. ఆ ఏడాదిలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు కాగా, నిధిలో సుమారు రూ. 8,452 కోట్ల ముగింపు నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు. 2024, 25లో జరిగిన ఖర్చు నిధి ముగింపు నిల్వలో కేవలం 0.01 శాతం మాత్రమేనని ఖర్గే ఎక్స్ వేదికగా ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రజా జవాబుదారీతనం లేని ప్రభుత్వ వ్యవస్థనా? విరాళాల దోపిడీకి ఒక రామ మందిర ట్రస్ట్ సరిపోలేదా అన్నట్లుగా ఉంది! గుర్తుంచుకోండి మోదీ, మీరే పీఎంకేర్స్ నిధిని, రామమందిర ట్రస్ట్‌ను ప్రకటించారు. మీ పర్యవేక్షణలోనే రెండింటికీ విరాళాలు అందుతున్నాయి!" అని అన్నారు. 2024 25 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పీఎంకేర్స్ నిధిలో రూ. 8,452 కోట్ల నిల్వ ఉందని ఖర్గే వెల్లడించారు. ఈ క్రమంలోనే నిధికి సంబంధించిన జవాబుదారీ విధానాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఇది సమాచార హక్కు చట్టం పరిధిలోకి రాదని, కాగ్ ఆడిట్ లేదా పార్లమెంటరీ జవాబుదారీతనానికి లోబడి లేదని ఆయన ఆరోపించారు. 202425లో నిధి నిల్వలో చాలా తక్కువ భాగం మాత్రమే ఖర్చయినప్పటికీ, అత్యవసర నిధిలో వేల కోట్లు ఎందుకు పోగుచేస్తున్నారని, దాని వెనుక ఉన్న కారణం ఏంటని ఖర్గే ప్రశ్నించారు.

# సెప్టెంబర్ 20న మునిసిపోల్స్?

(మొదటి పేజీ తరువాయి)



ఎన్నికల కమిషన్ తేదీలు పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది. గ్రామపంచాయతీ ఎన్నికలకు అక్టోబర్ 28న పోలింగ్ జరగనుందని, అదే రోజు కౌంటింగ్ జరగనుందని, అన్ని లోకల్ బాడీస్ నవంబర్ 1 నుండి కొత్త పాలకవర్గాలతో పనిచేసేలా చంద్రబాబు సారధ్యంలోని కూటమి సర్కార్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. అధికారిక కసరత్తు జరుగుతుండగా, తేదీలపై నెలాఖరుకల్లా స్పష్టత రానుంది.ఈ స్థానిక ఎన్నికలను అధికార కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా భావిస్తుండగా, అధికారపార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా యుద్ధం చేసైనా గెలవాలని పోరాడాలని వైఎస్ జగన్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# పెన్షన్లు ఇవ్వలేరు కానీ ఫ్రీ స్కీమ్స్ ఇస్తారా?

- ఉచిత పథకాలపై హైకోర్టు సంచలన వ్యాఖ్యలు..
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై స్టే ఎత్తివేతకు నిరాకరణ!




హైదరాబాద్, మహా : ఉచిత సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై తెలంగాణ హైకోర్టు మరోసారి అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై విధించిన తాత్కాలిక స్టేను ఎత్తి వేయడానికి హైకోర్టు నిరాకరించింది. ప్రజల పన్నుల డబ్బును ఉచిత పథకాలకు విచ్చలవిడిగా ఉపయోగించడంపై న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఈ ఉచిత పథకాలకు సంబంధించిన జీఓలకు చట్టబద్ధత లేదని గతంలోనే స్టే విధించింది. ఈ స్టేను వెకేట్ చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, స్టే ఎత్తివేసేందుకు సుముఖత చూపలేదు. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. "ఉచిత పథకాల వల్ల ప్రజాధనం భారీగా వృధా అవుతోంది" అని వ్యాఖ్యానించింది. ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల సొమ్మును ఉత్పాదక రంగాలకు కాకుండా, కేవలం ఉచిత పథకాలకే దారబోయడం సరికాదని అభిప్రాయపడింది. పెన్షన్లు, భూనిర్వాసితుల పరిహారంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రశ్నిస్తూ హైకోర్టు పలు కీలక అంశాలను లేవనెత్తింది. ఉద్యోగులు, పెన్షనర్ల ఇబ్బందులు: పదవీ విరమణ చేసిన ఎంతోమంది ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని, ఇందుకోసం వారు కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందని కోర్టు గుర్తుచేసింది. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలు తరాల తరబడి ప్రభుత్వ పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయని, వారికి ఇవ్వాల్సిన చట్టబద్ధమైన పరిహారం కంటే ఉచిత పథకాలే ప్రభుత్వానికి ప్రాధాన్యతగా మారాయా? అని నిలదీసింది.

**సెప్టెంబర్ 9 వరకు నిలిచిపోయిన నిధులు**
ప్రభుత్వ అభ్యర్థనను తోసిపుచ్చుతూ, ఈ పథకాలకు సంబంధించిన నిధుల పంపిణీపై విధించిన స్టేను కోర్టు పొడిగించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కూడిన సమగ్ర కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను సెప్టెంబర్ 9 కి వాయిదా వేసింది. ఫలితంగా అప్పటివరకు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థిక సాయం నిలిచిపోనుంది.

## బావిలోకి దూసుకెళ్లిన కారు
# ఒకే కుటుంబంలో నలుగురు మృతి

**సిద్దిపేట జిల్లా దుబ్బాకలో విషాదం**



సిద్దిపేట, మహా : జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. బావిలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో నలుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదం దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన దండుగల రాజు, భాగ్య దంపతులకు కుమారుడు నిహాన్ష్, కుమార్తె శాన్విక సంతానం. వీరు పని మీద సిద్దిపేట వెళ్లగా.. బుధవారం అర్ధరాత్రి తర్వాత కారులో స్వగ్రామానికి బయల్దేరారు. అప్పనపల్లి శివారుకు రాగానే.. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. అటుగా వెళ్తున్న వారు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ తర్వాత పోలీసులు అగ్ని మాపక సిబ్బంది సహాయంతో వారిని వెలికితీసే ప్రయత్నం చేశారు. జేసీబీతో బావిలో నుంచి కారును బయటకు తీయగా.. అప్పటికే నలుగురు మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవటంతో వారి కుటుంబంలో, బల్వంతాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఆ వ్యాఖ్యలకు నాకు సంబంధం లేదు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టించిన కొండా సుస్మిత వ్యాఖ్యల వ్యవహారంపై ఆమె తల్లి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్పందించారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు గురువారం లేఖ ద్వారా సురేఖ వివరణ ఇచ్చారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తల్లిని రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సముచితం కాదని ఆమె పేర్కొన్నారు. ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు బాధ్యత వహించాలనడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వివరించారు. సుస్మిత వ్యాఖ్యల విషయంలో తన ప్రమేయం లేదని, ఈ అంశాన్ని ఆ కోణంలోనే పరిగణించాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై తనకు పూర్తి గౌరవం ఉందని, పార్టీ క్రమశిక్షణను తాను ఎప్పుడూ గౌరవిస్తానని లేఖలో పేర్కొన్నారు.

# జనసేన ఎంపీ లింగమననేని రమేశ్ కుమారుడి ర్యాష్ డ్రైవింగ్

- ఇనార్బిట్ మాల్ ఎదురుగా కారుతో యువతిని ఢీకొట్టిన సంజూష్
- చికిత్సపొందుతూ యువతి మృతి కేసు నమోదు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్‌ఆర్బిట్ మాల్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 26 ఏళ్ల షాపింగ్ మాల్ ఉద్యోగిని భారతి ముఖి మృతి చెందిన ఘటనలో విచారణ వేగవంతం చేసిన పోలీసులు, ప్రముఖ వ్యాపారవేత్త, ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడు లింగమనేని సంజూష్‌ను నిందితుడిగా చేరుస్తూ కేసు నమోదు చేశారు. సంజూష్ పై ఎఫ్ఐఆర్ కూడా ఫైల్ చేశారు. హైదరాబాద్ ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఈనెల 16న కారు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతి మృతిచెందారు. రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్ అతివేగంగా కారు నడిపి యువతిని ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి సహచరుల ఫిర్యాదుతో మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణానికి కారణమైనందుకు గాను భారతీయ నాయ సంహిత సెక్షన్ 106(1) కింద లింగమనేని సంజూష్ పై పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.




# రాహుల్ 'ఛాత్రోన్ కీ గూంజ్'కు 30 ఆంక్షలు

- డ్రోన్లకు నో ఎంట్రీ.
- పుణెలో ఆగస్టు 22న కార్యక్రమం.
- 8–10 వేల మంది హాజరయ్యే అవకాశం.
- శాంతిభద్రతలపై నిర్వాహకులదే బాధ్యత

**పుణె,మహా :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 22న పుణెలో నిర్వహించనున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమానికి పోలీసులు 30 షరతులతో అనుమతి ఇచ్చారు. విద్య, భద్రత, సమానత్వం, పోటీ పరీక్షలు, కెరీర్ అవకాశాలపై విద్యార్థులతో చర్చించేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం ఎస్‌ఎస్‌పీఎంఎస్ కళాశాల మైదానంలో సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరగనుంది. సుమారు 8 వేల నుంచి 10 వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసులు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు.కార్యక్రమంలో అభ్యంతరకరమైన బ్యానర్లు, చిత్రాలు ప్రదర్శించరాదని పోలీసులు స్పష్టం చేశారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఎలాంటి చర్యలు ఉండకూడదని ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగితే అందుకు నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అనుమతి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**వేదిక చుట్టూ కట్టుదిట్టమైన భద్రత**

ప్రధాన వేదిక ముందు 'డికార్డన్' బారికేడింగ్ ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు తగినన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, అగ్నిమాపక భద్రత వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని స్పష్టం చేశారు.

మహిళా భద్రతా సిబ్బందితో పాటు తగిన సంఖ్యలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను నియమించాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో మహిళా వాలంటీర్లను కూడా పెద్ద సంఖ్యలో వినియోగించాలని పోలీసులు పేర్కొన్నారు. వేదికతో పాటు కార్యక్రమ ప్రాంగణం మొత్తాన్ని కవర్ చేసేలా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు.

**డ్రోన్లు, బీమ్ లైట్లపై నిషేధం**

కార్యక్రమ ప్రాంగణంలో ఫొటోగ్రఫీ లేదా ఇతర అవసరాల కోసం డ్రోన్లను వినియోగించరాదని పోలీసులు స్పష్టం చేశారు. ఆకాశంలోకి ప్రసరించే అధిక తీవ్రత కలిగిన బీమ్ లైట్లపైనా ఆంక్షలు విధించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, సీఐఎస్ఎఫ్ నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో పోలీసు, వైద్య, అగ్నిమాపక వాహనాలు సులభంగా చేరుకునేలా ప్రత్యేక మార్గాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమానికి ముందు అగ్నిమాపక, ట్రాఫిక్ విభాగాల నుంచి అవసరమైన నిరభ్యంతర ధ్రువపత్రాలు (ఎన్‌ఓసీలు) తీసుకోవాలని స్పష్టం చేశారు.

శబ్ద కాలుష్యానికి సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, శబ్ద కాలుష్య (నియంత్రణ) నిబంధనలు-2000, పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 నిబంధనలను పాటించాలని పోలీసులు ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు జరిగినా అనుమతిని ఎప్పుడైనా రద్దు చేసే అధికారం తమకు ఉంటుందని స్పష్టం చేశారు.

**ఆగస్టు 31 వరకు పుణెలో ఆంక్షలు**

పండుగలు, వివిధ కార్యక్రమాల నేపథ్యంలో పుణె నగరంలో మంగళవారం నుంచి ఆగస్టు 31 వరకు 14 రోజుల పాటు నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి. బహిరంగ సభలు, దిష్టిబొమ్మల దహనం తదితర కార్యక్రమాలపై ఆంక్షలు విధించారు. ఈ పరిణామాన్ని కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు.

కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా పోలీసుల చర్యలను ప్రశ్నిస్తూ, పండుగల భద్రత పేరుతో విధించిన ఆంక్షలు రాహుల్ గాంధీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకున్నవేనని ఆరోపించారు. అయితే పోలీసులు మాత్రం శాంతిభద్రతలు, భద్రతా ప్రమాణాల దృష్ట్యానే నిబంధనలు విధించినట్లు చెబుతున్నారు.

**నియంత్రిత కార్యక్రమం' అంటూ ఫడణవీస్ విమర్శలు**

రాహుల్ గాంధీ కార్యక్రమంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా విమర్శలు గుప్పించారు. 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ అన్ని వర్గాల విద్యార్థులతో బహిరంగంగా చర్చించే అవకాశం కనిపించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఒక నిర్దిష్ట భావజాలానికి చెందిన విద్యార్థులకే అవకాశం కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

యువతతో రాజకీయ నాయకులు మమేకం కావడాన్ని తాను స్వాగతిస్తానని, అయితే విద్యార్థి సమాజంలోని అన్ని వర్గాలతో పారదర్శకంగా సంభాషించినప్పుడే అలాంటి కార్యక్రమానికి నిజమైన అర్థం ఉంటుందని ఫడణవీస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న పార్టీ నిర్ణయంపైనా ఆయన విమర్శలు చేశారు.

# సామాన్యుడిలా బైక్‌పై..

- కేబీఆర్ పార్క్ చుట్టూ సీపీ సర్‌ప్రైజ్ చెక్.
- వన్‌వే ట్రాఫిక్ తీరును స్వయంగా పరిశీలించిన సజ్జనార్.
- జంక్షన్ల వద్ద పోలీసులను ఆరా

**హైదరాబాద్, మహా.:** నగరంలో హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్వయంగా పరిశీలించారు. సామాన్యుడిలా బైక్‌పై ప్రయాణిస్తూ ట్రాఫిక్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో గమనించారు. రోడ్ నంబర్ 45 నుంచి ఫిల్మ్‌నగర్ వరకు బైక్‌పై రెండుసార్లు తిరుగుతూ వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ తీరును పరిశీలించారు.హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆగస్టు 18 నుంచి వన్‌వే ట్రాఫిక్ విధానం అమల్లోకి వచ్చింది. దీంతో తొలిరోజు వాహనదారులు కొంత అయోమయానికి గురైనప్పటికీ, రెండో రోజు పరిస్థితి మెరుగుపడిందని సీపీ తెలిపారు.

**జంక్షన్ల వద్ద పోలీసులతో ఆరా**

బైక్‌పై పర్యటించిన సీపీ సజ్జనార్ పలు జంక్షన్ల వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడారు. వాహనాల రద్దీ ఎలా ఉంది? ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా? వాహనదారులకు మార్గదర్శనం ఎలా చేస్తున్నారు? వంటి అంశాలపై ఆరా తీశారు. మధ్యాహ్నం కూడా మరోసారి అదే మార్గంలో పర్యటించి ట్రాఫిక్ సరళిని పరిశీలించారు.వన్‌వే మార్గాల్లో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా



అన్ని ప్రధాన జంక్షన్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు సజ్జనార్ తెలిపారు. అవసరమైన మేరకు ట్రాఫిక్ సిబ్బందిని మోహరించినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపులు, సిబ్బంది నియామకంపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**పనులు పూర్తయ్యే వరకు సహకరించాలి**

హెచ్‌సిటీ ప్రాజెక్టు నగర భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న కీలక మౌలిక వసతుల ప్రాజెక్టు అని సీపీ పేర్కొన్నారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ సమయంలో తాత్కాలికంగా ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు తప్పవని తెలిపారు. జీహెచ్ఎంసీ, నిర్మాణ సంస్థ, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ పోలీసులు సూచించే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించడంతో పాటు వన్‌వే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని కోరారు.

సీపీ స్వయంగా బైక్‌పై రహదారులపైకి వచ్చి పరిస్థితిని పరిశీలించడం ట్రాఫిక్ నిర్వహణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టికి నిదర్శనంగా నిలిచింది.

## 22ఏ భూములపై సీబీఐ విచారణ జరపాలి

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన వ్యవహారంపై బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించిన ఆయన.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భూములను ఎవరి ఆదేశాలతో నిషేధిత జాబితాలో చేర్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

గురువారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన లక్ష్మణ్.. కేవలం అధికారులపై చర్యలు తీసుకుంటే సరిపోదని, నిర్ణయాల వెనుక ఉన్న బాధ్యులను గుర్తించి విచారణ జరిపించాలని అన్నారు. 22ఏ జాబితాను పూర్తిగా బహిర్గతం చేసి, నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ వ్యవహారంపై మంత్రి పొంగులేటి క్షమాపణలు చెప్పడం మాత్రమే సరిపోదని, ప్రజల ఆస్తులపై ప్రభావం చూపే నిర్ణయాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.

తెలంగాణలో ప్రజాపాలన పేరుతో దోపిడీ పాలన కొనసాగుతోందని లక్ష్మణ్ ఆరోపించారు. భూముల విషయంలో అక్రమాలు, సెటిల్‌మెంట్లు, దందాలు జరుగుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని కూడా నిషేధిత జాబితాలో చేర్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామం రాష్ట్రంలో భూ రికార్డుల నిర్వహణ తీరుపై అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

# దక్షిణాదిని ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలి!

- అమరావతి–బెంగళూరు–చెన్నై బుల్లెట్ రైలు కారిడార్.
- దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించాలి: సీఎం చంద్రబాబు



**చెన్నై, మహా :** వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది రాష్ట్రాలు కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, కేంద్ర-రాష్ట్రాల మధ్య విశ్వాసం, సమన్వయంతోనే దక్షిణాది సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో చంద్రబాబు పలు కీలక ప్రతిపాదనలు చేశారు.

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులను అనుసంధానిస్తూ అమరావతి-బెంగళూరు-చెన్నై నగరాల మధ్య బుల్లెట్ రైలు కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు. కుప్పం మీదుగా ఈ రవాణా మార్గాన్ని అభివృద్ధి చేస్తే మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక అనుసంధానం మరింత బలోపేతమవుతుందని వివరించారు. వేగవంతమైన రవాణా వ్యవస్థతో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

**దక్షిణాది కోసం ఉమ్మడి ప్రణాళికలు**

దక్షిణాది రాష్ట్రాల మధ్య ఉమ్మడి సరకు రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. వ్యూహాత్మక ప్రాంతాల్లో డ్రై పోర్టులను ఏర్పాటు చేసి సరకు రవాణా వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో మరింత సమర్థంగా అనుసంధానించాలని కోరారు.

దక్షిణాది రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను అనుసంధానిస్తూ ఉమ్మడి సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని సూచించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రం తక్షణ సహాయం అందించేలా ఉమ్మడి సహాయక దళాన్ని ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు.

**ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త మార్గం**

తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు అనుసంధానించే ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను చంద్రబాబు కోరారు. దక్షిణాది నుంచి ఉత్తర భారతంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిస్తే పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని గుర్తుచేశారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ పది లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**విభజన సమస్యలకు పరిష్కారం చూపాలి**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని తొమ్మిది, పది షెడ్యూళ్లలోని సంస్థల విభజన సమస్యలు 12 ఏళ్లుగా కొనసాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. వాటి పరిష్కారానికి కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడంతోపాటు వనరుల లోటును భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోలవరం, దక్షిణ కోస్తా రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో ముందుకు సాగుతున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించామని గుర్తుచేశారు. విభజన చట్టంలోని 56వ సెక్షన్‌కు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు.

**విశాఖ, విజయవాడ మెట్రోకు అనుమతులు**

దుగ్గరాజపట్నం ఓడరేవు, రిఫైనరీ ప్రతిపాదనలకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని చంద్రబాబు కోరారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కడప-జేఎస్‌డబ్ల్యూ రైల్వే అనుసంధానానికి కూడా కేంద్రం నుంచి అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

**గోదావరి–కావేరి అనుసంధానంపై దృష్టి**

గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలైతే తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు నదీ జలాల విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

గంగా-కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక రూపొందించాలని కోరారు. నదుల అనుసంధాన ప్రాజెక్టులకు కాలపరిమితితో కూడిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, అవసరమైన అనుమతులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు.

**చంద్రబాబు విజన్‌పై సీఎంల ప్రశంసలు**

దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం, సమన్వయంతోనే ప్రాంతీయ ప్రగతి సాధ్యమవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రతిపాదనలు సమావేశంలో చర్చకు వచ్చాయి. చంద్రబాబు ప్రసంగాన్ని పలువురు ముఖ్యమంత్రులు ప్రశంసించారు. సీనియర్ నాయకుడిగా విశాల దృక్పథంతో అన్ని దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు మాట్లాడారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అభినందించారు.దక్షిణాది రాష్ట్రాలు ఒక్కొక్కటిగా అభివృద్ధి చెందడం కంటే పరస్పరం అనుసంధానమై సమష్టిగా ముందుకు సాగితే దేశ ఆర్థికాభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా మారగలవన్నది ఈ సమావేశంలో చంద్రబాబు ప్రతిపాదనల సారాంశంగా నిలిచింది.

# వందేమాతరంపై కాంగ్రెస్ నిర్ణయం

- అమిత్ షా తీవ్ర ఆగ్రహం.
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనా?'.
- 1937 నాటి చారిత్రక తప్పిదాన్ని మళ్లీ పునరావృతం చేస్తున్నారంటూ ధ్వజం.

ఢిల్లీ, మహా : 'వందేమాతరం' విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. జాతీయ గీతం విషయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ నిర్ణయం దేశ విభజనకు దారితీసిన చారిత్రక పరిణామాలను పునరావృతం చేసే విధంగా ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆ పార్టీ మరోసారి బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా దాని చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తు చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం విచారకరమని అమిత్ షా వ్యాఖ్యానించారు. వందేమాతరంలోని మొత్తం భాగాన్ని ఆలపించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడం సరికాదన్నారు.

**1937 నాటి నిర్ణయాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారంటూ..**

1937లో కాంగ్రెస్ వందేమాతరం విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. అప్పట్లో ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వందేమాతరాన్ని రెండు భాగాలుగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఆ నిర్ణయం దేశ విభజనకు దారితీసిన పరిస్థితులకు మరింత బలం చేకూర్చిందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే నిర్ణయాన్ని కాంగ్రెస్ మరోసారి ముందుకు తీసుకురావడం ద్వారా గతంలోని చారిత్రక తప్పిదాన్ని పునరావృతం చేస్తోందని అమిత్ షా విమర్శించారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో వందేమాతరం నినాదం పోషించిన పాత్రను విస్మరించరాదని పేర్కొన్నారు.

**స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడమే: షా**

వందేమాతరాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో 'వందేమాతరం' అంటూ ప్రాణత్యాగం చేసిన లక్షలాది మంది వీరులను కాంగ్రెస్ అవమానిస్తోందని అమిత్ షా ఆరోపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం ఒక స్ఫూర్తిదాయక నినాదంగా నిలిచిందని గుర్తుచేశారు.వందేమాతరం రచనకు 150 సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో దాని చారిత్రక, జాతీయ ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం అందుకు విరుద్ధంగా ఉందని విమర్శించారు.

**కాంగ్రెస్–బీజేపీ మధ్య మరింత ముదిరిన వివాదం**

వందేమాతరం విషయంలో కాంగ్రెస్ నిర్ణయంపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ దుమారం రేపుతున్నాయి. జాతీయ చిహ్నాలు, స్వాతంత్ర్యోద్యమ చరిత్రను రాజకీయాలకు అతీతంగా చూడాలా? లేక వాటి చారిత్రక నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని ప్రస్తుత రాజకీయ విధానాలను ప్రశ్నించాలా? అన్న చర్చకు ఈ వివాదం దారితీస్తోంది.

అయితే వందేమాతరంలోని ఏ భాగాన్ని అధికారిక కార్యక్రమాల్లో ఆలపించాలన్న అంశంపై కాంగ్రెస్, బీజేపీల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు రానున్న రోజుల్లో మరింత రాజకీయ వేడిని పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# స్థానిక సమరానికి జనసేన సన్నద్ధం

- కార్యకర్తల ఆత్మగౌరవమే ప్రాధాన్యం
- పొత్తుల అంశం నేను చూసుకుంటా
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పెరుగుతున్న నేపథ్యంలో జనసేన పార్టీ కూడా క్షేత్రస్థాయిలో సమర సన్నాహాలు ప్రారంభించింది. పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధ్యక్షతన అమరావతిలో గురువారం జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో స్థానిక ఎన్నికల వ్యూహంపై విస్తృతంగా చర్చించారు. శాసనసభ ఎన్నికల సమయంలో పాటించిన పొత్తు ధర్మాన్ని కొనసాగిస్తూనే, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇచ్చేలా స్థానిక ఎన్నికల్లో ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిసింది.రాష్ట్రంలోని జనసేనకు చెందిన 21 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక పరిస్థితులు, పార్టీకి ఉన్న బలం, ప్రజల్లో కార్యకర్తల ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల వ్యూహాన్ని రూపొందించాలని నేతలకు సూచించారు. జనసేనకు బలమైన పట్టు ఉన్న ఇతర ప్రాంతాలను కూడా గుర్తించి అక్కడ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

**ప్రత్యక్ష ఎన్నికలకు మద్దతు**

మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం మంచిదేనన్న అభిప్రాయాన్ని సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు వ్యక్తం చేసినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేసి ముందస్తు ప్రణాళిక రూపొందించాలని పవన్ కల్యాణ్ సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ కార్యకర్తలతో సమన్వయం పెంచుకోవడంతో పాటు స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించి నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపైనా సమావేశంలో చర్చ జరిగింది. కార్యకర్తలు, ప్రజలు చెబుతున్న సమస్యలను ఎమ్మెల్యేలు స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పవన్ సూచించారు. ప్రజలతో పార్టీ శ్రేణుల అనుసంధానం మరింత బలోపేతం కావాలని అన్నారు.

**పొత్తుల బాధ్యత నాదే**

స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పొత్తులకు సంబంధించిన అంశాలను తాను చూసుకుంటానని, పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ విషయంలో ఎలాంటి అనవసర వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసినట్లు తెలిసింది. పార్టీ నిర్దేశించిన విధానానికి అనుగుణంగానే ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని ఆదేశించారు.శాసనసభ ఎన్నికల్లో కూటమి విజయానికి జనసేన కార్యకర్తలు కీలకంగా పనిచేశారని, వారి మనోభావాలను స్థానిక ఎన్నికల్లోనూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. పొత్తు ధర్మాన్ని కొనసాగిస్తూనే జనసేనకు బలం ఉన్న ప్రాంతాల్లో పార్టీ శ్రేణులకు తగిన ప్రాధాన్యం కల్పించేలా వ్యూహం రూపొందించనున్నట్లు సమాచారం.మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంటున్న వేళ జనసేన శాసనసభాపక్ష సమావేశం నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార కూటమిలో భాగస్వామిగా ఉంటూనే క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా జనసేన నాయకత్వం ముందుకు సాగుతున్నట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# వరాలిచ్చే తల్లి వరలక్ష్మి



శ్రావణ శుక్రవారం.. సౌభాగ్య సంపదలకు శుభవేళ శ్రావణం అంటేనే శుభాల మాసం.. శ్రావణం అంటేనే శక్తి ఆరాధన.. శ్రావణం అంటేనే ఇంటింటా పసుపు పరిమళం, ముత్తయిదువుల మంగళధ్వని, దీపాల వెలుగులో లక్ష్మీదేవి సన్నిధి.

ఆకాశంలో మబ్బులు కమ్ముకుని నేల పచ్చని చీర కట్టుకునే వేళ.. ప్రకృతి పులకించే పుణ్యకాలం శ్రావణమాసం. ఈ మాసంలోని ప్రతి శుక్రవారం మహిళల భక్తిశ్రద్ధలకు, మంగళకాంక్షలకు, కుటుంబ సౌభాగ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. అందులోనూ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం మరింత విశిష్టమైనది. అదే **వరలక్ష్మీ వ్రతం.

'వర' అంటే శ్రేష్ఠమైనది.. కోరిన వరాలను ప్రసాదించేది అనే అర్థాలున్నాయి. భక్తులు కోరుకున్న శుభాలను, సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని అనుగ్రహించే మహాలక్ష్మి స్వరూపమే వరలక్ష్మి. అందుకే ఈ వ్రతానికి అంతటి ప్రాశస్త్యం.

పెళ్లయిన మహిళలు తమ కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, భర్తకు ఆయురారోగ్యాలు కలగాలని, సంతానం అభివృద్ధి చెందాలని కోరుకుంటూ ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. అవివాహిత యువతులు తమకు సద్గుణసంపన్నుడైన అనుకూల వరుడు లభించాలని అమ్మవారిని ప్రార్థిస్తారు. అయితే వరలక్ష్మీ వ్రతం కేవలం మహిళల పూజాకార్యక్రమం మాత్రమే కాదు.. **కుటుంబం, సౌభాగ్యం, సంపద, ఆరోగ్యం, ధైర్యం, విజ్ఞానం, విజయాల సమగ్ర ఆకాంక్షకు ప్రతీక.

**అష్టలక్ష్ముల సమాహార స్వరూపం**

లక్ష్మీదేవి అనుగ్రహం అనగానే కేవలం ధనం మాత్రమే గుర్తుకు రావడం సహజం. కానీ సనాతన ధర్మం సంపదకు మరింత విశాలమైన అర్థాన్ని ఇచ్చింది. జీవితం సార్థకం కావడానికి అవసరమైన ప్రతి శుభశక్తీ లక్ష్మీ తత్వంలోనే అంతర్లీనమై ఉందని చెబుతుంది. ఆదిలక్ష్మి ప్రాణశక్తికి అధిదేవతగా నిలిచి ఆరోగ్యాన్ని, ఆత్మశాంతిని ప్రసాదిస్తుంది. ధాన్యలక్ష్మి పాడిపంటలు, ఆహార సమృద్ధి, అన్నపూర్ణతను అనుగ్రహిస్తుంది. ధైర్యలక్ష్మి కష్టాలను ఎదుర్కొనే మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.గజలక్ష్మి గృహసౌఖ్యం, సంపద, వస్తు, వాహనాభివృద్ధికి ప్రతీక.సంతానలక్ష్మి సత్సంతానం, వారి అభివృద్ధి, వంశవృద్ధిని ప్రసాదిస్తుంది. విజయలక్ష్మి ప్రయత్నాలకు విజయాన్ని, కార్యసిద్ధిని అందిస్తుంది.విద్యాలక్ష్మి విజ్ఞానం, వివేకం, విద్య, నైపుణ్యాలను అనుగ్రహిస్తుంది.ధనలక్ష్మి ధర్మబద్ధంగా సంపాదించిన సత్సంపదను స్థిరంగా నిలిపే తల్లి.ఈ అష్టలక్ష్ముల సమగ్ర స్వరూపమే **వరలక్ష్మి**. అందుకే వరలక్ష్మీ వ్రతాన్ని భక్తితో ఆచరించడం ద్వారా అష్టలక్ష్ముల అనుగ్రహం సమష్టిగా లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి.

**చారుమతి భక్తికి ప్రతిఫలం**

వరలక్ష్మీ వ్రత మహిమను చాటిచెప్పే చారుమతి వృత్తాంతం ఎంతో ప్రసిద్ధమైనది.పూర్వం విదర్భ రాజ్యంలో కుండినపురం అనే నగరం ఉండేది. అక్కడ చారుమతి అనే సద్గృహిణి నివసించేది. భర్తను దైవస్వరూపంగా భావిస్తూ, అత్తమామలను కన్న తల్లిదండ్రుల్లా సేవిస్తూ, ధర్మనిష్ఠతో జీవించేది. ఇంటి బాధ్యతలను నిర్వర్తించడమే కాకుండా భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు చేసేది.ఆమె భక్తికి, పతివ్రతా ధర్మానికి, సేవాభావానికి ప్రసన్నురాలైన శ్రీమహాలక్ష్మి ఒక రాత్రి చారుమతికి స్వప్నంలో సాక్షాత్కరించింది. **శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం తనను వరలక్ష్మి రూపంలో ఆరాధించాలని** ఆదేశించింది.దివ్యసందేశంతో పులకించిన చారుమతి మరుసటి రోజు తన చుట్టుపక్కల ఉన్న స్త్రీలకు ఈ విషయాన్ని తెలియజేసింది. అందరూ కలిసి శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మంగళహారతులు ఇచ్చి, వాయనాలు పంచుకున్నారు.వ్రతం పూర్తయిన వెంటనే అద్భుతం జరిగింది. చారుమతి ఇంటితో పాటు వ్రతంలో పాల్గొన్న స్త్రీల గృహాలన్నీ ధనధాన్యాలతో కళకళలాడాయి. వారి శరీరాలు స్వర్ణాభరణాలతో శోభిల్లాయి. వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.**భక్తి, నియమం, సేవ, సౌభాగ్యానికి ప్రతిఫలంగా లక్ష్మీకటాక్షం ఎలా లభిస్తుందో చారుమతి కథ చాటి చెబుతుంది.** ఈ వ్రత మాహాత్మ్యాన్ని సాక్షాత్తు పరమశివుడు పార్వతీ దేవికి వివరించినట్లు స్కాంద పురాణంలో కథనం కనిపిస్తుంది.V

**చిత్రానేమికి శాపవిమోచనం**

వరలక్ష్మీ వ్రత మహిమను తెలియజేసే మరో కథ చిత్రానేమి వృత్తాంతం.చిత్రానేమి పరమశివుని పరిచారకుల్లో ఒకడు. ఒకసారి పార్వతీ పరమేశ్వరులు వినోదంగా పాచికలు ఆడుతుండగా, గెలుపోటములను నిర్ణయించే బాధ్యత చిత్రానేమికి అప్పగించారు. శివునిపై ఉన్న భక్తితో న్యాయాన్ని పక్కనపెట్టి పరమేశ్వరుడినే విజేతగా ప్రకటించాడు.

తన తీర్పులో పక్షపాతం కనిపించడంతో పార్వతీదేవి ఆగ్రహించింది. చిత్రానేమిని కుష్ఠురోగిగా మారాలని శపించింది. తన తప్పును గ్రహించిన చిత్రానేమి పశ్చాత్తాపంతో అమ్మవారిని వేడుకున్నాడు.కరుణామయి అయిన పార్వతీదేవి అతడిని క్షమించి, భూలోకంలో ముత్తయిదువులు శ్రావణ శుక్రవారం ఆచరించే **వరలక్ష్మీ వ్రతాన్ని దర్శించి, ఆ వ్రత ప్రసాదాన్ని స్వీకరిస్తే శాపవిమోచనం కలుగుతుందని** అనుగ్రహించింది. చిత్రానేమి అమ్మవారి ఆజ్ఞను పాటించి శాపవిముక్తుడైనట్లు స్కాంద పురాణం వివరిస్తుంది.

**శ్రావణమాసం ఎందుకంత ప్రత్యేకం?**

సనాతన సంప్రదాయంలో శ్రావణమాసానికి అత్యున్నత స్థానం ఉంది. లక్ష్మీదేవికి మాత్రమే కాదు, శ్రీమహావిష్ణువుకూ ఈ మాసం ప్రీతికరమైనదని ఆధ్యాత్మిక సంప్రదాయం చెబుతుంది. అందుకే శ్రావణానికి విష్ణుప్రియ మాసం అనే పేరూ ఉంది.పౌర్ణమి రోజున శ్రవణ నక్షత్రం రావడం వల్ల ఈ మాసానికి 'శ్రావణం' అనే పేరు వచ్చిందని చెబుతారు. శ్రీకృష్ణుడు, వామనుడు వంటి విష్ణు అవతారాలకు శ్రవణ నక్షత్రంతో సంబంధం ఉందని పురాణ సంప్రదాయం పేర్కొంటుంది.'శ్రవణం' అంటే వినడం. భక్తుల మొరలను ఆలకించి, వారి కోరికలను లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువుకు విన్నవిస్తుందనే భక్తిభావన కూడా శ్రావణమాస విశిష్టతను మరింత పెంచుతుంది.'శ్రావణే మాసి గోవిందం సర్వదా పూజయేత్ నరః' అనే భావనతో ఈ మాసంలో లక్ష్మీసమేత శ్రీమహావిష్ణువును ఆరాధించడం విశేష ఫలప్రదమని భక్తులు విశ్వసిస్తారు.

**శుక్రవారానికీ.. లక్ష్మీదేవికీ ఉన్న అనుబంధం**

వరలక్ష్మీ వ్రతం కేవలం తిథిని ఆధారంగా చేసుకుని నిర్ణయించేది కాదని ఆచార సంప్రదాయాలు చెబుతున్నాయి. లగ్నం, నక్షత్రం, తిథి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.జ్యోతిషశాస్త్రంలో శుక్రగ్రహం ఐశ్వర్యం, సౌందర్యం, కళలు, భోగభాగ్యాలకు అధిపతిగా భావించబడుతుంది. లక్ష్మీనారాయణులకు అత్యంత ప్రీతికరమైన శ్రావణమాసంలో, శుక్రునికి అధిపత్యం ఉన్న శుక్రవారం రోజున లక్ష్మీదేవిని ఆరాధించడం విశేష ఫలప్రదమనే విశ్వాసం ఉంది.సాధారణంగా శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతానికి ప్రధానమైనదిగా భావిస్తారు. ఆ రోజున అవకాశం కుదరకపోతే శ్రావణమాసంలోని ఇతర శుక్రవారాల్లోనూ తమ కుటుంబ సంప్రదాయం, పండితుల సూచన మేరకు వ్రతాన్ని ఆచరిస్తారు.

**ప్రాంతాలు మారినా.. భక్తి ఒక్కటే**

వరలక్ష్మీ వ్రతం దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుంది. ఆచారాల్లో ప్రాంతీయ వైవిధ్యం ఉన్నా.. అంతర్లీనమైన భక్తిభావం మాత్రం ఒక్కటే.తెలుగు రాష్ట్రాల్లో వరలక్ష్మీ వ్రతం, తమిళనాడులోవరలక్ష్మి నోంబు, కర్ణాటకలో 'వరమహాలక్ష్మి హబ్బగా ఈ పర్వదినం ప్రసిద్ధి చెందింది.

**పూజకు మించిన పరమార్థం**

వరలక్ష్మీ వ్రతం అంటే కేవలం ఒకరోజు చేసే పూజ కాదు. అది **కుటుంబ సౌఖ్యాన్ని కోరే ప్రార్థన.. దాంపత్య బంధాన్ని గౌరవించే సంప్రదాయం.. స్త్రీ శక్తిని ఆరాధించే సంస్కృతి.. సమాజంలో పరస్పర మమకారాన్ని పెంచే ఆచారం.ఇంటి ముంగిట ముగ్గులు, గుమ్మానికి మామిడాకుల తోరణాలు, పూజామందిరంలో వెలిగే దీపాలు, పసుపు కుంకుమల పరిమళం, ముత్తయిదువుల మంగళగీతాలతో ప్రతి ఇల్లు ఒక చిన్న ఆలయంలా మారుతుంది.అమ్మవారి ముందు వెలిగించే ఒక్క దీపం కేవలం ఇంటిని మాత్రమే వెలిగించదు.. మనసులోని ఆశలను, ఆలోచనలను, ఆత్మవిశ్వాసాన్ని కూడా వెలిగిస్తుందనే విశ్వాసమే ఈ వ్రతానికి జీవం.ధనం ఉంటేనే సంపద కాదు.. ఆరోగ్యం, ధైర్యం, జ్ఞానం, సంతానం, విజయం, సంతృప్తి, కుటుంబ సౌఖ్యం—ఇవన్నీ కలిసినప్పుడే జీవితం సంపూర్ణం. ఈ సమగ్ర సంపదకు ప్రతీకగా నిలిచే అమ్మవారే వరలక్ష్మి.

శ్రావణ శుక్రవారం నాడు భక్తితో కొలిచే వరలక్ష్మి..ప్రతి ఇంటా సిరిసంపదలు నింపాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, ప్రతి మనసులో శాంతి నెలకొనాలని అనుగ్రహించే తల్లిగా కోట్లాది మంది భక్తుల ఆరాధనలు అందుకుంటోంది.

సర్వమంగళ మాంగల్యే.. శివే సర్వార్థ సాధికే..శరణ్యే త్ర్యంబికే దేవి.. నారాయణి నమోస్తుతే.శ్రావణ శుక్రవారం వెలిగే ప్రతి దీపం..ప్రతి ఇంటా సౌభాగ్య జ్యోతిగా
ప్రతి హృదయంలో భక్తి దీప్తిగా
ప్రతి కుటుంబంలో శ్రీలక్ష్మీ కటాక్షంగా వెలుగొందాలని కోరుకుందాం.

- మహా డెస్క్

# కాఫీతో యూరిక్ యాసిడ్ తగ్గుతుందా?



ఉదయం లేవగానే ఒక కప్పు వేడి కాఫీ తాగడం చాలామందికి రోజువారీ అలవాటు. కొందరికి కాఫీ లేకుండా రోజు ప్రారంభం కానట్టే ఉంటుంది. అయితే రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు, కీళ్ల వాతం సమస్యతో బాధపడేవారు కాఫీ విషయంలో కొంత సందిగ్ధతకు గురవుతుంటారు. కాఫీ తాగితే యూరిక్ యాసిడ్ పెరుగుతుందా? లేక తగ్గుతుందా? కీళ్ల వాతం ఉన్నవారు కాఫీకి దూరంగా ఉండాలా? అనే ప్రశ్నలు తరచూ వినిపిస్తుంటాయి. ఈ అంశంపై జరిగిన పరిశోధనలు మాత్రం కాఫీకి సంబంధించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నాయి.

యూరిక్ యాసిడ్ అనేది శరీరంలో సహజంగా ఏర్పడే వ్యర్థ పదార్థం. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాల్లో ఉండే పురిన్ అనే పదార్థం శరీరంలో విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. సాధారణ పరిస్థితుల్లో మూత్రపిండాలు రక్తంలోని యూరిక్ యాసిడ్‌ను వడపోసి మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. అయితే శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా తయారవడం లేదా మూత్రపిండాలు దాన్ని తగినంతగా బయటకు పంపలేకపోవడం వల్ల రక్తంలో దాని స్థాయిలు పెరుగుతాయి.

యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువ కాలం అధికంగా ఉంటే కీళ్లలో స్ఫటికాలు పేరుకుపోయే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కాలి బొటనవేలు, మోకాళ్లు, మడమలు, చేతి వేళ్ల కీళ్లలో తీవ్రమైన నొప్పి, వాపు, ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ పరిస్థితినే సాధారణంగా కీళ్ల వాతం అని పిలుస్తారు. అందుకే యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్నవారు ఆహారపు అలవాట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు.

**పరిశోధనలు ఏం చెబుతున్నాయి?**

కాఫీ, యూరిక్ యాసిడ్, కీళ్ల వాతం మధ్య ఉన్న సంబంధంపై గత కొన్నేళ్లుగా పలు పరిశోధనలు జరిగాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం కాఫీ తాగే వారిలో కీళ్ల వాతం వచ్చే ముప్పు కొంత తక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా ఎక్కువ కాలం క్రమం తప్పకుండా కాఫీ తీసుకునే వ్యక్తుల్లో ఈ ప్రభావం కనిపించినట్లు కొన్ని పరిశోధనలు సూచించాయి.

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. కాఫీ తాగడం వల్ల రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తప్పనిసరిగా తగ్గుతాయని స్పష్టమైన ఆధారాలు లేవు. అంటే కాఫీని యూరిక్ యాసిడ్‌ను తగ్గించే ఔషధంగా పరిగణించకూడదు. కొన్ని పరిశోధనల్లో కాఫీ తీసుకునే వారిలో కీళ్ల వాతం ముప్పు తగ్గినట్లు కనిపించినప్పటికీ, దానికి కారణం కాఫీ మాత్రమే అని నిర్ధారించలేం.

**కాఫీ ఎందుకు ఉపయోగపడొచ్చు?**

కాఫీలో కేవలం కెఫిన్ మాత్రమే ఉండదు. పాలీఫెనాల్స్, క్లోరోజెనిక్ యాసిడ్ వంటి అనేక సహజ సమ్మేళనాలు కూడా ఉంటాయి. వీటిలో కొన్ని యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. శరీరంలోని జీవక్రియలు, వాపు సంబంధిత ప్రక్రియలు, యూరిక్ యాసిడ్ నిర్వహణపై ఈ సమ్మేళనాలు కొంత ప్రభావం చూపవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

ఇంకో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే కెఫిన్ లేని కాఫీని తీసుకునే వారిలో కూడా కీళ్ల వాతం ముప్పు తక్కువగా ఉన్నట్లు కొన్ని అధ్యయనాలు సూచించాయి. దీనిని బట్టి కాఫీ వల్ల కనిపించే ప్రయోజనం కేవలం కెఫిన్ కారణంగా మాత్రమే ఉండకపోవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కాఫీలో ఉండే ఇతర సహజ సమ్మేళనాలు కూడా ఇందులో పాత్ర పోషించే అవకాశం ఉందని భావిస్తున్నారు.అయితే ఈ పరిశోధనలను చూసి కాఫీ తాగితే యూరిక్ యాసిడ్ సమస్య పూర్తిగా తగ్గిపోతుందని అనుకోవడం మాత్రం తప్పు. కాఫీ ప్రభావం వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లు, శరీర బరువు, ఇతర అనారోగ్య సమస్యలు, తీసుకుంటున్న మందులు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

**కాఫీలో చక్కెర ఎక్కువగా ఉంటే జాగ్రత్త**

యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్నవారు కాఫీ తాగే విషయంలో మాత్రమే కాకుండా కాఫీలో ఏమి కలుపుతున్నారనే విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. సాధారణంగా పంచదార లేకుండా తీసుకునే కాఫీ లేదా తక్కువ పంచదారతో తీసుకునే కాఫీకి, అధికంగా తీపి పదార్థాలు కలిపిన కాఫీకి చాలా తేడా ఉంటుంది.అధికంగా చక్కెర కలిపిన కాఫీలు, రుచుల కోసం తీపి సిరప్‌లు, కొవ్వు పదార్థాలు, తీపి క్రీమ్ వంటి వాటిని ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. ముఖ్యంగా ఫ్రక్టోజ్ అధికంగా ఉండే చక్కెర పదార్థాలు శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తిని పెంచే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల కాఫీ తాగేటప్పుడు చక్కెర పరిమాణాన్ని నియంత్రించడం ముఖ్యం.రోజుకు పలుమార్లు అధిక చక్కెరతో కూడిన కాఫీలు తీసుకుంటూ, మరోవైపు యూరిక్ యాసిడ్ తగ్గుతుందని భావించడం సరైనది కాదు. కాఫీతో పాటు మొత్తం ఆహారపు అలవాట్లను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తీపి పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, మద్యం వంటి వాటిని తగ్గించడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే ఎంత కాఫీ తాగాలి?**

ఇప్పటికే కాఫీ తాగే అలవాటు ఉండి, దాని వల్ల ఎలాంటి అసౌకర్యం లేకపోతే కాఫీని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని సాధారణంగా భావిస్తారు. అయితే మితంగా తీసుకోవడం మంచిది. రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల కాఫీ చాలామందికి సరిపోతుంది. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి పరిమాణం మారవచ్చు.

# కమ్యూనిస్టుల వైరుధ్యాలు

భారతదేశ రాజకీయ ముఖచిత్రంపై దశాబ్దాలుగా తమదైన ముద్ర వేసిన వామపక్ష పార్టీల సిద్ధాంతాలకు, వారి ఆచరణకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వేదికలెక్కితే ప్రజాస్వామ్యం, పౌర హక్కులు, పత్రికా స్వేచ్ఛ గురించి గళమెత్తే కమ్యూనిస్టు నాయకులు, చరిత్ర పుటల్లో వారు తీసుకున్న నిర్ణయాలు, సమర్థించిన విధానాలను నిశితంగా పరిశీలిస్తే వారి ద్వంద్వ వైఖరి స్పష్టమవుతుంది. దేశంలో విధించిన ఎమర్జెన్సీకి మద్దతు పలకడం దగ్గరి నుండి, ఏమాత్రం ప్రజాస్వామ్యం లేని చైనా కమ్యూనిస్టు పార్టీ విధానాలకు వంతపాడటం వరకు వారి ప్రయాణం అనేక విమర్శలకు తావిస్తోంది. సిద్ధాంతపరంగా బద్ధ శత్రువులైన శక్తులతో కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వారు కలుపుతున్న చేతులు, సెక్యులరిజం పేరుతో చేస్తున్న పొత్తులు దేశ వ్యాప్తంగా విస్మయానికి గురిచేస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణ, పౌర హక్కుల గురించి నిత్యం ఉపన్యాసాలు ఇచ్చే సి.పి.ఐ గతాన్ని పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగుచూస్తాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయంగా మిగిలిపోయిన ఎమర్జెన్సీ కాలంలో, పౌరుల ప్రాథమిక హక్కులన్నింటినీ పాతాళంలోకి తొక్కిన అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వానికి వారు బహిరంగంగా మద్దతు పలికారు. నియంతృత్వాన్ని నిలదీయాలని నేడు పిలుపునిచ్చే వారు, ఆనాడు ఒక నిరంకుశ నిర్ణయానికి పల్లకి మోయడం వారి సిద్ధాంతాలలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. ఆనాటి వారి ప్రజాస్వామ్య ప్రేమ ఏమైందన్నది నేటికీ సమాధానం లేని ప్రశ్నే. ఇక సి.పి.ఎం మేధావుల విషయానికి వస్తే, రాజ్యాంగం, భావప్రకటనా స్వేచ్ఛ అంటూ నిత్యం మాట్లాడే వీరు చైనా కమ్యూనిస్ట్ పార్టీకి (సి.సి.పి) బేషరతుగా సాష్టాంగ నమస్కారం చేయడం మరో విడ్డూరం. "చైనా చైర్మనే మా చైర్మన్" అని నిస్సిగ్గుగా ప్రకటించుకున్న ఈ నాయకులు, చైనాలోని వాస్తవ పరిస్థితులను మాత్రం ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తుంటారు. వాస్తవానికి చైనాలో పత్రికా స్వేచ్ఛ శూన్యం. ఏ వార్త బయటకు రావాలో, ఏది రాకూడదో అక్కడి కమ్యూనిస్ట్ పార్టీయే శాసిస్తుంది. భావప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తూ, హక్కుల కోసం తియాన్మెన్ స్క్వేర్‌లో శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపైకి ఏకంగా యుద్ధ ట్యాంకులను దించి నెత్తుటేరులు పారించిన ఘనత ఆ ఆదర్శ కమ్యూనిజానిది. అలాంటి మారణహోమంపై కిక్కురుమనని ఈ కామ్రేడ్లు, ఇక్కడకొచ్చి మాత్రం విలువల గురించి కబుర్లు చెప్పడం వింతగా తోస్తుంది. వీటన్నింటికీ మించి ప్రస్తుత రాజకీయాల్లో అత్యంత ఆశ్చర్యకరమైన పరిణామం కమ్యూనిస్టు పార్టీలు ఎం.ఐ.ఎం, ముస్లిం లీగ్ లాంటి ఇస్లామిక్ శక్తులతో చెట్టాపట్టాలేసుకుని తిరగడం. పైగా దీనికి వారు 'సెక్యులరిజం' అనే ఓ ముద్దుపేరును తగిలించుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఇస్లామిక్ గల్ఫ్ దేశాల్లో కమ్యూనిస్టులకు కనీస మనుగడ కూడా లేదు. దేవుడు లేడనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అక్కడ ఎవరైనా ప్రస్తావిస్తే, 'బ్లాస్ఫెమీ' (దైవదూషణ) కింద ఏకంగా తలలు తీసేసే చట్టాలున్నాయి. అంటే, ఏ దేశాల్లోనైతే కమ్యూనిస్టులకు కనీసం ప్రాణాలతో బతికే హక్కు కూడా నిరాకరించబడుతుందో, ఆ భావజాలానికి చెందిన శక్తులతోనే ఇక్కడ పొత్తులు పెట్టుకోవడం హాస్యాస్పదం.

మరోవైపు, కమ్యూనిస్టులకు అత్యంత ఆదర్శప్రాయమైన చైనాలో ఇస్లాంకు వేస్తున్న రెడ్ కార్పెట్ ఏమీ లేదు. అక్కడ వీగర్ ముస్లింలను అక్షరాలా ఊచకోత కోస్తున్న పరిస్థితులు ఉన్నాయి. మహమ్మద్, రెహమాన్ లాంటి పేర్లు పెట్టుకోకూడదని ఫత్వా జారీ చేయడమే కాకుండా, ఖురాన్ లోని కొన్ని పేజీలను, వాక్యాలను పూర్తిగా నిషేధించిన ఘనత ఆ కమ్యూనిస్టు సర్కారుదే. చైనాలో ఇస్లాం పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తున్నా, ఇక్కడి కమ్యూనిస్టులు గానీ, ఇస్లామిక్ శక్తులు గానీ వాటిని ప్రశ్నించవు. బయట దేశాల్లో ఉప్పూనిప్పులా ఉండే ఈ రెండు సిద్ధాంతాలు, భారతదేశంలోకి వచ్చేసరికి మాత్రం అత్యంత ఆత్మీయంగా కౌగిలించుకుంటాయి.

ఇంతటి సైద్ధాంతిక వైరుధ్యాలు, అవకాశవాద రాజకీయాలు చేస్తూనే, ఈ రెండు శక్తులు ఏకమై బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ వంటి జాతీయవాద శక్తులపై 'మతోన్మాదులు' అనే ముద్ర వేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. అంతర్జాతీయ స్థాయిలో ఒకరికొకరు ఏమాత్రం పొసగని, ఒకరి దేశాల్లో ఒకరికి ఉనికే లేని ఈ శక్తులు, భారతదేశ గడ్డపైకి వచ్చి ఇక్కడి ప్రజలకు ప్రజాస్వామ్యం, మత స్వేచ్ఛ, రాజ్యాంగ విలువల గురించి నీతులు చెప్పడం ఒక చారిత్రక ప్రహసనం. ఇదంతా గమనిస్తున్న సగటు పౌరుడికి "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు" అన్న సామెత కచ్చితంగా వీళ్ల కోసమే పుట్టిందన్న భావన కలగక మానదు. రాజకీయాల్లో సిద్ధాంతాల కన్నా అవకాశవాదమే ముఖ్యమన్న చేదు నిజాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

(గడల నరసింహారావు
సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం.)





# పాలకుర్తి లో రాజీవ్ గాంధీ జయంతి

**పాలకుర్తి 20 మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పాలకుర్తి మండలం లోని బసంత్ నగర్ టోల్ గేట్ వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్,పాలకుర్తి మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సుర సమ్మయ్య, సర్పంచ్ లు తోట స్వప్న మహేష్, పెద్దపల్లి తిరుమల, అఖిల అంజినాయక్, ప్రశాంత్, మాజీ ఉప సర్పంచ్ జ్యోతి శంకర్, శ్రీపతి సురేష్, కుమార్ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# కాకర్లపల్లి పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

**రెవెన్యూ మంత్రి పొంగులేటికి సీపీఎం నేత జాజిరి శ్రీనివాస్ వినతి**

**సత్తుపల్లి,ఆగస్టు 20: మహా** మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో పేదల ఇంటి స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కాకర్లపల్లి గ్రామంలో ఇంటి స్థలాలు లేక అనేక పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ పాత కాలువ ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని, సింగరేణి సంస్థ మట్టితో పూడ్చిన అనంతరం ఏర్పడిన భూమిని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించే అవకాశం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

# ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి ,మహా**: ప్రభుత్వం విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యలలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని తెలిపారు. అదనంగా నిర్మిస్తున్న గదులు, భోజనశాల పనులను త్వరగా పూర్తి చేయాలని, వంటశాలలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, విద్యార్థుల గైర్హాజరును ప్రతిరోజు పర్యవేక్షిస్తూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని పల్లంగూడ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం, నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనాల పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలోని డంప్ కంపోస్ట్ పిట్ ను పరిశీలించి, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న శాశ్వత కూరగాయల పందిరి సాగును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాళ్లపల్లి మౌనిక యూనిట్‌లో చేపట్టిన ఈ సాగుకు యూనిట్ వ్యయం 2 లక్షల 50 వేల రూపాయలు కాగా ఉద్యానవన శాఖ ద్వారా 1 లక్ష రూపాయల రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఇలాంటి ఆధునిక సాగు పద్ధతులను వినియోగించుకుని అదనపు ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన/ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు, బోధన విధానంపై వివరాలు తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. మండలంలోని రేకులగూడలో గల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న గదులు, వంటశాలలను పరిశీలించి నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలోమండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రూపారెడ్డి హత్యపై ట్రస్మా ఆగ్రహం

- **మందమర్రిలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ**
- **నేటి పాఠశాలల బంద్‌కు సంపూర్ణ మద్దతు**

**మందమర్రి, మహా** : నల్లగొండ జిల్లాలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య ఘటనపై మందమర్రి మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన రూపారెడ్డిపై విద్యార్థులే దాడి చేసి హత్య చేయడం అత్యంత విషాదకరమని ట్రస్మా నాయకులు పేర్కొన్నారు.ఈ ఘటనను నిరసిస్తూ గురువారం సాయంత్రం 6 గంటలకు మందమర్రి మార్కెట్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే పాఠశాలల బంద్‌కు ట్రస్మా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ట్రస్మా మండల అధ్యక్షులు పెద్దపెల్లి ఉప్పలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న డ్రగ్స్ సంస్కృతి, చిన్నారులకు విచ్చలవిడిగా అందుబాటులోకి వస్తున్న సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, హింసాత్మక కంటెంట్ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురువులను హతమార్చే స్థాయికి విద్యార్థులు దిగజారడం సమాజానికి తీరని మచ్చ అని అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రస్మా మండల గౌరవాధ్యక్షులు పోల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రూపారెడ్డి హత్య ఘటన రాష్ట్రాన్ని కలచివేసిందన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలిని విద్యార్థులే హత్య చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు గురవుతున్న విద్యార్థులపై తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రుల అతిగారాబం, క్రమశిక్షణ లోపం వంటి కారణాలతో విద్యార్థుల్లో బాధ్యతారాహిత్యం పెరుగుతోందని ఆయన అన్నారు. పాఠశాలల్లో క్రమశిక్షణను అమలు చేసే విషయంలో ఉపాధ్యాయులకు తగిన స్వేచ్ఛ, రక్షణ కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రూపారెడ్డి హత్య కేసులో నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని అత్యంత కఠిన శిక్ష విధించాలని ట్రస్మా నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# మొక్కలు నాటండిపరిరక్షించండి

- **మున్సిపల్ చైర్ పర్సన్ పిలుపు**
- **గాంధీ పార్క్ లో మొక్కలు నాటిన అనూష**

**ఆదిలాబాద్ మహా** : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలోని గాంధీ పార్కులో పూల మొక్కలను నాటారు.పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లలో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు, చెట్లను పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపే అంశాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు, మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్ , ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికిరణ్, స్టైప్ మాజీ సీఈవో వెంకటేశ్వర్లు, స్టైప్, గాంధీ పార్కు , మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలల సదనంలో సౌకర్యాలు మెరుగుపరచాలి

- **విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**
- **బాలల సదనం, పాఠశాల, పీహెచ్‌సీలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆకస్మిక తనిఖీలు**

**మణుగూరు, మహా :** బాలల సదనంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రాంతంలో ఉన్న బాలల సదనంతో పాటు సమీపంలోని హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలల సదనంలోని విద్యార్థుల గదులు, వంటశాల, ఆవరణ, మరుగుదొడ్లను పరిశీలించారు. తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణపై వార్డెన్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సదనంలో అవసరమైన ఫ్యాన్లు, విద్యుత్ లైట్లు, ఇతర ఎలక్ట్రికల్ మరమ్మతులు చేపట్టడంతో పాటు డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ అద్దంకి నరేష్ను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన సబ్ కలెక్టర్ వారి యోగక్షేమాలు, వసతి సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థినులకు అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఇష్టమైన ఆహారం ఏమిటని స్వయంగా అడిగి తెలుసుకుని, వారు కోరుకున్న ఆహారాన్ని సాయంత్రం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమీపంలోని హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సైతం సబ్ కలెక్టర్ పరిశీలించి అక్కడి పరిస్థితులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ అద్దంకి నరేష్, బాలల సదనం వార్డెన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రూపా రెడ్డి హత్యను ఖండించిన ట్రస్మా

**భువనగిరి, ఆగస్టు 20:** విద్యార్థుల చేతిలో హత్యకు గురైన ఉపాధ్యాయురాలు రూపా రెడ్డి మృతిని ట్రస్మా ఖండించింది. గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూరల వెంకటేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిని విద్యార్థులే హత్య చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ట్రస్మా ప్రతినిధులు పాల్గొన్నారు.



# దోమల నివారణతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట

- **ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన**
- **బీసీ బాలుర వసతి గృహంలో ఆరోగ్య శిబిరం..**

**మణుగూరు, మహా :** పరిసరాల పరిశుభ్రతతో దోమల వృద్ధిని అరికట్టి, వాటి ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను ఎప్పటికప్పుడు తొలగించాలని వివరించారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ ఉమాదేవి సమక్షంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సీజనల్ వ్యాధుల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వసతి గృహంలోని వంటశాలను పరిశీలించి, వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయడం, పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేయడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి పరంగిణి, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ సత్తెమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, కృష్ణ, ఏఎన్ఎం సుమ తదితరులు పాల్గొన్నారు.



# మందమర్రిలో నీరు గారుతున్న 170 చట్టం

**గిరిజన భూముల్లో యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాలు..!**




మందమర్రి, మహా : మందమర్రి ఏజెన్సీ మున్సిపాలిటీలో అక్రమ భవన నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. మన్య ప్రాంతాల పరిరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలు ఇక్కడ మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయి. మంచిర్యాల జిల్లా కూత వేటు దూరంలోనున్న మందమర్రి పట్టణ గిరిజన భూములు, అందులో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు పుట్టగొడుగుల వలె వెలుస్తున్నా స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు జిల్లా ఉన్నతాధికారులకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పవచ్చు.

**నిబంధనలకు తూట్లు..**

నాటి ప్రభుత్వాలు గిరిజనుల భూమి హక్కులను కాపాడి, వారిని ఆర్థికంగా, సామాజికంగా రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చింది. ముఖ్యంగా 170 చట్టం ప్రకారం గిరిజన భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన ఆంక్షలు ఉన్నాయి. కానీ, మందమర్రి పట్టణంలో మాత్రం ఈ నిబంధనలకు పాతర వేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేని చోట, అసలు గిరిజనేతరులు కొనుగోలు చెయ్యని ఈ భూముల్లో బడాబాబులు, వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎంట్రీ ఇచ్చి భారీ కాంప్లెక్సులు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు.

**అధికారుల మౌనమే అస్త్రమా..?**

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ నిర్మాణాలపై స్థానికులు, సదరు బాధితులు చాలా సార్లు ఫిర్యాదు చేసినా, టౌన్ ప్లానింగ్ అధికారుల్లో స్పందన కనబడడం లేదని సర్వత్రా ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలో విచ్చలవిడిగా భవన నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళ్లెదుటే భారీ భవనాలు వెలుస్తున్నప్పటికీ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక భారీ మొత్తంలో చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అనుమతుల జారీలో గోల్‌మాల్**

గిరిజన చట్టం 1/70 అమలులో ఉన్న ప్రాంతాలలో అక్రమ పక్క భవన నిర్మాణాలు జరిపితే.. ఆ నివాసాలకు ఇంటి నంబర్ సదరు మున్సిపల్ అధికారులు ప్లాన్ అప్రూవల్స్ ఎలా ఇస్తున్నారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన రెవెన్యూ రాబడికి గండి పడుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి, మందమర్రిలో 170 చట్టం ఉల్లంఘన, అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# నూతన కోర్టు ప్రారంభానికి సర్వం సిద్ధం




**క్యాతనపల్లి మహా :**మందమర్రి లో నూతన కోర్టు ప్రారంభానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల స్థాయిలో న్యాయస్థానం అందుబాటులోకి రానుండటంతో ప్రజలు, న్యాయవాదులు, కక్షిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు న్యాయపరమైన వ్యవహారాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలకు నూతన కోర్టు ఏర్పాటు ఎంతో ఉపయుక్తంగా మారనుంది.ఆగస్టు 22న ఉదయం మందమర్రిలో నూతన కోర్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి న్యాయశాఖకు చెందిన ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, న్యాయవాదులు హాజరయ్యే అవకాశం ఉంది.

**ప్రజలకు మరింత చేరువగా న్యాయ సేవలు**

మందమర్రి ప్రాంతంలో కోర్టు ఏర్పాటు కావడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కానున్నాయి. వివిధ కేసులకు సంబంధించి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కానున్నాయి. ముఖ్యంగా పేదలు, సామాన్యులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్థానికంగానే న్యాయ సేవలు అందుబాటులోకి రావడం ప్రయోజనకరంగా ఉంటుందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణలో న్యాయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొత్త కోర్టులు, కోర్టు భవనాల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో న్యాయ మౌలిక వసతులను మెరుగుపరిచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు కేసుల పరిష్కారంలో వేగం పెంచేందుకు న్యాయస్థానాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఆధునిక సౌకర్యాలతో నూతన కోర్టుల ఏర్పాటుతో న్యాయ సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని న్యాయవర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

**చారిత్రాత్మక ఘట్టంగా ప్రారంభోత్సవం**

మందమర్రి ప్రాంతంలో నూతన కోర్టు ప్రారంభం కావడం చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలవనుంది. కోర్టు అందుబాటులోకి రావడంతో న్యాయం కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కొంతమేర తగ్గనున్నాయి. నూతన కోర్టు భవిష్యత్‌లో ప్రాంతీయ న్యాయ అవసరాలను తీర్చే కీలక కేంద్రంగా అభివృద్ధి చెందాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.ఆగస్టు 22న జరగనున్న ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**న్యాయవాదులకు కూడా వెసులుబాటు-న్యాయవాది రాజలింగు మోతె**



మందమర్రిలో నూతన కోర్టు ప్రారంభంతో స్థానికంగా ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులకు కూడా మరింత వెసులుబాటు కలగనుంది. కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ప్రయాణ సమయం తగ్గడంతో కేసుల విచారణ ప్రక్రియ మరింత సులభతరం అయ్యే అవకాశం ఉంటుంది.



# దేశ సాంకేతిక విప్లవ సృష్టికర్త రాజీవ్ గాంధీ

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**జూలూరుపాడు, మహా:** భారతదేశ శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞాన విప్లవ సృష్టికర్త మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్ విగ్రహానికి పూల మాలలేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతరత్న, దేశ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ భారత దేశ అభివృద్ధికి శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన సిద్ధాంత కర్త అని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం, పార్టీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, లచ్చు నాయక్, మధుసూదన రావు, సుమంత్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామకృష్ణ, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ భారతి లక్ష్యం

- **బేతుపల్లిలో 6 వేల ఎకరాల రీ-సర్వే పూర్తి.. అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే తుది హక్కుల నమోదు**
- **వ్యవసాయ భూముల దారులు, చెరువులను పరిరక్షించాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**సత్తుపల్లి,ఆగస్టు 20:** మహా: రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూ భారతి చట్టం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం నిర్వహించిన భూ రీసర్వేపై రైతులతో ముఖాముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. బేతుపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఇప్పటికే సుమారు 6 వేల ఎకరాల రీసర్వే పూర్తయిందని, మిగిలిన భూమికి కూడా సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. రీసర్వే అనంతరం 30 రోజుల పాటు రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పూర్తిగా పరిష్కరించిన తర్వాతే తుది భూ హక్కులను నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధార్ తరహాలో భూములకు కూడా భూధార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. వ్యవసాయ భూములకు వెళ్లే దారులను తప్పనిసరిగా పరిరక్షించాలని, వాటిని పట్టాదారు భూములుగా నమోదు చేయరాదని అధికారులను ఆదేశించారు. చెరువులకు స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసి, ఆక్రమణలకు తావులేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఏడాదిన్నరలో వ్యవసాయ భూములు, ఆబాది ఆస్తుల రీసర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. అక్రమంగా 22ఏ భూములను క్రమబద్ధీకరించుకునే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో భూ సమస్యలు లేని పరిస్థితి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. భూ భారతి చట్టం రైతుల ప్రయోజనాలకు ఉపయోగపడేలా క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# మౌలాలి పరిశ్రమలో మత్తు పదార్థాల తయారీ.. ఇద్దరి అరెస్ట్

**చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలింపు**

**కుషాయిగూడ, మహా :** మౌలాలి పారిశ్రామిక వాడలోని ఎస్‌ఎం ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మత్తు పదార్థాల తయారీకి సంబంధించిన కేసులో పరిశ్రమ అధినేత గూడూరు మాణిక్యరెడ్డి, ప్రొడక్షన్ మేనేజర్ సంపత్ మల్లారెడ్డిని ఎన్‌సీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు.ఎపిడ్రిన్, ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల తయారీకి సంబంధించిన సమాచారం మేరకు ఎన్‌సీబీ అధికారులు ఎస్‌ఎం ల్యాబ్స్‌పై దాడి చేసి సుమారు రూ.17.40 కోట్ల విలువైన మత్తు పదార్థాలు, 69 కిలోల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఏప్రిల్ 20న పరిశ్రమలో పనిచేస్తున్న సైంటిస్ట్ చాగంటి వీర వెంకటలక్ష్మి కుమారుడు, ముడి పదార్థాలు సరఫరా చేసిన కాసాని శ్రీనివాస్, రమేష్‌గౌడ్‌లను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోంది.



# 20 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయండి

- **గ్రామ కంటంలో నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వండి**
- **వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేత**
- **తోటకూర వజ్రేష్ యాదవ్, శాంతి కోటేష్ గౌడ్**

**కుషాయిగూడ, మహా** : జవహర్ నగర్ డివిజన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్ల నిర్మాణానికి 20 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ తదితరులు కమిషనర్ ను కలిశారు. జవహర్ నగర్ డివిజన్ లోని పలు కాలనీలలో దెబ్బతిన్న డ్రైనేజ్ వ్యవస్థ, రోడ్లను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. 20 కోట్లతో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రతిపాదనలను పరిశీలించి త్వరలో నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. గ్రామకంఠ పరిధిలో పాత ఇళ్లకు ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వాలని కూడా వినతిపత్రంలో కోరారు. అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అనుమతులు మంజూరు చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, మాట్ల వినయ్, బొబ్బిలి మంజుల, విజయరాయ్, గజ్వేల్ శంకర్, వెంకటేశ్వర్, సుబ్రహ్మణ్యం, సాయి తదితరులు పాల్గొన్నారు.



# దేశ విజ్ఞాన సాంకేతిక విప్లవానికి మార్గదర్శకుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

**82 వ జయంతి వేడుకలు...**

**రాజేంద్రనగర్ మహా ;** భారత మాజీ ప్రధాని దేశ విజ్ఞాన, సాంకేతిక విప్లవానికి మార్గదర్శకుడు రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని ఎమ్మెల్యే నివాస అవరణలో డివిజన్ అధ్యక్షులు ధనంజయ్ నేతృత్వంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశాన్ని 21వ శతాబ్దపు ఆధునిక సాంకేతిక విప్లవం వైపు నడిపించిన దార్శనికుడు, దేశంలో ఐటీ టెలికమ్యూనికేషన్స్, కంప్యూటర్ యుగానికి ఆద్యుడు,దేశంలోనే అత్యంత పిన్న వయస్సులో (40 సంవత్సరాలకే) భారత 6వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ రాజనీతిజ్ఞుడు భారతరత్న పురస్కార గ్రహీత రాజీవ్ గాంధీ జయంతి ప్రతి సంవత్సరం ఆగస్టు 20న దేశవ్యాప్తంగా సద్భావనా దివస్గా అత్యంత ఘనంగానిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో సరికొండ వేంకటేష్, మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, అర్జున్, ప్రేమ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువతకు ఆదర్శం రాజీవ్ గాంధీ

- **ఆయన జయంతి సందర్భంగా నోములలో ఘన నివాళులు**
- **మాజీ ప్రధాని సేవలు మరువలేనివి విష్ణువర్ధన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 20 మహా:** దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నోముల గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంచాల మండలం, నోముల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లాటి రవీందర్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవలు చేశారని, దేశంలోకి ఐటీ రంగాన్ని తీసుకువచ్చిన ఘనత ఆయనదేనని కొనియాడారు. దేశం అభివృద్ధి కోసం దేశ ప్రజల కోసం ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు భారతదేశ రూపురేఖలే మార్చేశాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లూరి ముత్యమయ్య, వార్డ్ మెంబర్స్ ఎంపల తిరుమలరెడ్డి, పల్నాటి జంగయ్య, పార్టీ సీనియర్ నాయకులు మోకిలా ఉపేందర్ రెడ్డి, మోకిళ్ళ బుచ్చిరెడ్డి, కసరమౌని రాజేష్, చిమ్మనమోని కృష్ణ, విజయకుమార్, మంగళవారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి నివాళి

- **నేటి సాంకేతిక విప్లవానికి ఆయన వేసిన పునాదులే కారణమన్న ఎమ్మెల్యే**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 20 మహా:** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్ అందించిన సేవలను స్మరించుకున్నారు. యువత, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి కారణంగానే టెక్నాలజీలో దేశం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. దేశ ప్రగతి కోసం ఆయన చూపిన మార్గాన్ని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకొని, భవిష్యత్తులో తమకంటూ ఒక ఒక స్థానాన్ని గుర్తింపును తెచ్చుకునేలా యువత ముందు అడుగు వేయాలని ఎమ్మెల్యే అన్నారు.

# ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

**మల్కాజిగిరి సీపీ సుమతి**

**కుషాయిగూడ, మహా :** మహిళలు, యువతులు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి హెచ్చరించారు. ఏఎస్‌రావునగర్ అణుపురం కమ్యూనిటీ హాలులో షీటీమ్‌లకు పట్టుబడిన ఈవ్‌టీజర్లకు సంస్కార్ మెగా కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు నెలల్లో 252 మందికిపైగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ షీటీమ్‌లకు పట్టుబడ్డారని సుమతి తెలిపారు. మైనర్ల నుంచి 50 ఏళ్లు దాటిన వారి వరకు ఈ నేరానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పద్ధతి మార్చుకోకుండా మళ్లీ మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ ఇళ్లలోనూ తల్లి, అక్క, చెల్లి వంటి మహిళలు ఉన్నారనే విషయాన్ని ఈవ్‌టీజర్లు గుర్తుంచుకోవాలని సూచించారు. ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకుని మహిళలను గౌరవంగా చూడటమే సంస్కార్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రవర్తన మార్చుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని తెలిపారు.కార్యక్రమంలో ఉప్పల్ డీసీపీ సురేశ్‌కుమార్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసిపి వెంకటరెడ్డి, కుషాయిగూడ సిఐ లెంకల భాస్కర్ రెడ్డి పోలీసు అధికారులు, మానసిక నిపుణులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆటో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**సామాజిక సేవ కార్యకర్త అనిల్ కుమార్**

**కుషాయిగూడ, మహా :** ఇళ్ల నుంచి నిత్యం చెత్త సేకరిస్తూ నగర పారిశుద్ధ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సామాజిక కార్యకర్త అనిల్‌కుమార్ కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి కుటుంబాల జీవనోపాధి, పిల్లల విద్య, సామాజిక భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. నిబంధనల అమలు పేరుతో కార్మికుల ఉపాధికి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చట్ట కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థకు బాధ్యతలు అప్పగించడం వల్ల తమ ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వెంటనే రాంకీ సంస్థను రద్దు చేసి కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు. స్వచ్ఛ నగర నిర్మాణంలో కీలకంగా పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమం, ఉద్యోగ భద్రత కల్పించాలని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు.

# ప్రజా సేవలో యువత ముందుకు రావాలి

- **లైన్స్ క్లబ్ సేవలు పేదలకు విస్తరింప చేస్తాం**
- **ఎమ్మెస్ రెడ్డి లైన్స్ క్లబ్ ఐ ఆస్పత్రి వైస్ చైర్మన్**

**కుషాయిగూడ, మహా :** అన్ని వర్గాల ప్రజలకు వైద్య, సామాజిక సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంఎస్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ వైస్ చైర్మన్ చల్లా లోహిత్‌రెడ్డి, చల్లా విజయలక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు. మీర్పేట్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎంఎస్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డయాబెటిక్ కేర్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్ల లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో స్వార్థం పెరిగిపోవడం అనర్థాలకు దారితీస్తోందన్నారు. యువతీ యువకులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. లయన్స్ క్లబ్ ద్వారా ఎంతోమంది పేదలకు వృద్ధులకు. మహిళలకు. కంటి ఆపరేషన్ల ద్వారా మంచి సేవకునిగా గుర్తింపు తెచ్చుకున్నారు ఈ దంపతులిద్దరూ ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ చింతల రామచందర్ దంపతులను అభినందించారు. గత 30 ఏళ్లుగా లోహిత్ రెడ్డి, విజయలక్ష్మి రెడ్డిలు లైన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేశారని, భవిష్యత్తులో కూడా ఇలాగే చేయాలని చింతల రామచందర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్ పొలాస, కోశాధికారి అంజిరెడ్డి, ముఖ్య సలహాదారు ప్రదీప్ పటేల్, సలహాదారు రాములు, ఉప చైర్మన్లు బి.ఎన్. రెడ్డి, లోహిత్‌రెడ్డి, సత్యరెడ్డి, కృష్ణమూర్తి, మల్లేశం, బి.శ్రీరెడ్డి, మునిరత్నంరెడ్డి, గోపాల్‌రెడ్డి, రామ్‌నివాస్, భరత్‌స్వామి, మల్లారెడ్డి, సత్య రెడ్డి. నరసింహారెడ్డి. వెంకటేశ్వరరావు. మోహన్‌దాస్, ముత్యంరెడ్డి, నారాయణ, రాజేంద్ర, మేడపాటి వెంకటసుబ్బారెడ్డి, వేముల వీరమల్లు, పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి, ప్రజా సేవలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

- **242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పూర్తి**
- **గురుకుల పాఠశాలలో పరిశుభ్రత, మెనూ అమలులో నిర్లక్ష్యంపై ఆగ్రహం : ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు**



**దమ్మపేట ,మహా** : దమ్మపేట మండలంలో అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గండుగులపల్లి మోడల్ సోలార్ గ్రామం, మదనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దమ్మపేట మండలం పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్.. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ రోగుల వివరాలు, వైద్యులు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రక్త పరీక్షల విభాగాన్ని పరిశీలించిన సందర్భంగా అనాలసిస్ యంత్రం పనిచేయకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. అది ఎప్పటి నుంచి పనిచేయడం లేదని సిబ్బందిని ప్రశ్నించగా, సుమారు ఏడాది కాలంగా పనిచేయడం లేదని తెలిపారు. యంత్రం నిర్వహణ, మరమ్మతుల కోసం ఇప్పటికే దరఖాస్తు సమర్పించామని సిబ్బంది వివరించారు. దీనిపై జిల్లా వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించిన కలెక్టర్.. "మీ ఇంట్లో ఏదైనా పరికరం పనిచేయకపోతే ఇలాగే వదిలేస్తారా?" అని ప్రశ్నించారు. సుమారు రూ.3 లక్షల విలువైన వైద్య పరికరం ఏడాది కాలంగా పనిచేయకపోయినా దాని మరమ్మతులు, నిర్వహణకు సకాలంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన కీలకమైన పరికరాలు పనిచేయని పరిస్థితిలో ఉంటే వెంటనే స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్య పరికరాల పనితీరును సమగ్రంగా పరిశీలించి, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోని వైద్య పరికరాల నిర్వహణ బాధ్యతను సంబంధిత మెడికల్ అధికారి లేదా ప్రత్యేక అధికారికి అప్పగించాలని, అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మోడల్ సోలార్ గ్రామం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సోలార్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానెళ్లను పరిశీలించి, సోలార్ యూనిట్ల ఏర్పాటు, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 424 మంది గృహజ్యోతి లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో స్లాబ్ ఉన్న 250 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటివరకు 242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయని వివరించారు. 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్‌ను ఒక్కో ఇంటికి సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ద్వారా సుమారు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, లబ్ధిదారులు తమ గృహ అవసరాలకు వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసి యూనిట్‌కు రూ.2 చొప్పున చెల్లిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్.. సోలార్ యూనిట్ల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకంతో పాటు సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మిగిలిన ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, గ్రామాన్ని ఆదర్శవంతమైన మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేసేలా పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మదలపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, డైనింగ్ హాల్, తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లో చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన పాఠశాలలో తరగతి గదులను సైతం పరిశుభ్రంగా ఉంచకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, ఇతర ప్రాంతాలను వెంటనే పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, తీసుకున్న చర్యలకు సంబంధించిన ఫోటోలను పంపించాలని ఆదేశించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజనంపై వివరాలు తెలుసుకున్నారు. ఆ రోజు మెనూ ఏమిటని, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించి భోజనం తయారీ, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. మెనూలో పేర్కొన్న కూర అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ వార్డెన్‌ను ప్రశ్నించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఎందుకు అందించడం లేదని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. డైనింగ్ హాల్‌లో డస్ట్‌బిన్ ఉన్నప్పటికీ దానిని సక్రమంగా నిర్వహించకపోవడంతో హాల్‌లో అపరిశుభ్రత నెలకొనడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన కనీస బాధ్యతను కూడా విస్మరించడంపై ప్రశ్నించారు. డైనింగ్ హాల్‌తో పాటు పాఠశాలలోని అన్ని ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం కనిపించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, మెనూ అమలులో నిర్లక్ష్యం వహించినందుకు ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా పాఠశాలలో విద్యుత్ సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన లైట్లు, ఇతర విద్యుత్ పరికరాలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు పరిశుభ్రమైన పరిసరాలు, నాణ్యమైన భోజనం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా పాఠశాల నిర్వాహకులు బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట శిక్షణ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహసీల్దార్ మురళి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష సేవలు అందించారు

- దూరదృష్టి కలిగిన నాయకుడు దివంగత మాజీ ప్రధాని
- పీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 20 మహా:** ఆదిభట్ల సర్కిల్, తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని తుర్కయంజాల్ చౌరస్తాలో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి, టిపిసిసి కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ అందించిన విశేష సేవలను గుర్తు చేశారు. అలాగే యువత, సాంకేతిక రంగం, దేశ ప్రగతి పట్ల ఆయనకున్న దూరదృష్టిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ ల అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, కోశిక ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, దాసరి సుధాకర్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి, భద్రయ్య, గిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు కొత్తకుర్మ యశ్వంత్, గుడ్ల అర్జున్, చెక్క ధన్ రాజ్, చెక్క ప్రశాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పోచారంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

- గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి హామీ
- ఇప్పటిదాకా అభివృద్ధిపై మాత్రమే దృష్టి సారించా...
- సోషల్ మీడియాలో పిచ్చి ప్రేలాపనలపట్ల ఇకపై భరతం పడతాం
- తీరుమారకపోతే మా కార్యకర్తలే ఉరికించి తంతారు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హెచ్చరిక...



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 20 మహా:** నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా ఇప్పటివరకు దృష్టి సారించానని... ఇకమీదట పిచ్చి ప్రేలాపనలు చేస్తున్న వారి భరతంపడతామని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.1.05కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ముందుగా రూ.20కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీ సిబ్బందితో సరదాగా సంభాషిస్తూ వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని, రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే, మరో రూ.20లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పోచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో లబ్ధిదారులతో కలిసి మల్ రెడ్డి రంగారెడ్డి గృహప్రవేశం చేశారు. ఏళ్లతరబడిగా దోచుకున్న వారికి... కోట్లరూపాయలు తెచ్చి తాను అభివృద్ధి చేస్తుంటే కడుపుమంటగా ఉందన్నారు. అందుకే సోషల్ మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై తీరు మారకుంటే తాట తీయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇదేతీరుగా వ్యవహరిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఉరికించి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేష్, టెంపుల్ చైర్మన్ నరేష్, కాంగ్రెస్ పార్టీ నేతలు ముత్యాల రాజశేఖర్ రావు, తాళ్లపల్లి చిన్న, పండి మహేందర్, వెంకటేష్, సిద్దు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఓ శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై ఏసీబీ దాడులు

- ఆదాయానికి మించిన అక్రమ ఆస్తుల కేసులో దర్యాప్తు
- రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 20 మహా:** ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి నివాసంపై, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో, శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన నివాసాలతోపాటు, కుటుంబ సభ్యుల ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నగదు, బంగారం తదితర వివరాలను అధికారులు పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో మహేశ్వరం మండలంలో ఎమ్మార్వోగా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆదాయానికి అనుగుణంగా కాకుండా అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాల్లో లభించిన ఆస్తుల పత్రాలు, ఇతర వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. తనిఖీలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న పత్రాలు, గుర్తించిన ఆస్తుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.




# రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- ఓ మాజీ ప్రజా ప్రతినిధి కుమారుడు కావడంతో పోలీసులు కేసు నమోదులో నిర్లక్ష్యంవహించారు.
- హాస్పటల్ వద్ద బాధితులు ఆందోళన



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం పెద్దతూప్రా గ్రామానికి చెందిన సాయి గౌడ్ మూడు రోజుల క్రితం కొత్తూరు వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన కారు అతని బైక్‌ను ఢీకొనడంతో సాయి గౌడ్ కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. స్థానికులు గాయపడిన సాయి గౌడ్ ను తొండుపల్లి లో చికిత్స నిమిత్తం లీమ్స్ హాస్పిటల్ లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం సాయిగౌడ్ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు నడుపుతున్న మాజీ ప్రజా ప్రతినిధి కుమారుడు మైనర్ అని తెలిసిన అధికారుల అండదండలు ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధిత కుటుంబం గ్రామస్తులు ఆరోపించారు. సాయి గౌడ్ మృతితో ఆగ్రహించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు ఆందోళనలు చేశారు. పరిస్థితి ఉద్రుతంగా మారడంతో పోలీసులు బాధితులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించి చేశారు.



# నేరాల నియంత్రణకు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు

- హైవే సంస్థల యజమానులు పోలీసులకు సహకరించాలి
- ఫ్యూచర్స్ సిటీ కమిషనర్తరుణ్ జోషి

**రాజేంద్రనగర్ మహా ;** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న హైవే సంస్థల యజమానులు, నిర్వాహకులు, ప్రతినిధులతో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా, తరుణ్ జోషి, హైవే భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, సీసీ కెమెరాలు, నేరాల నివారణ, అగ్నిమాపక భద్రత, పోలీసులతో కలిసి పనిచేయాలని 500 మంది సంస్థల ప్రతినిధులకు గురువారంఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధి, అంతర్రాష్ట్ర వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో హైవే భద్రతకు ప్రాధాన్యత మరింత పెరిగిందని ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా తరుణ్ జోషి తెలిపారు. రెస్టారెంట్లు, ధాబాలు, పెట్రోల్ బంకులు, ఇతర రహదారి పక్కన ఉన్న వ్యాపార సంస్థలు హైవే వినియోగదారుల భద్రత, విషయంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి సంస్థ యజమాని తమ ప్రాంగణం, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సాధ్యమైన చోట రహదారులను కవర్ చేసే విధంగా సి సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల కొన్ని ధాబాలు, రెస్టారెంట్ల పరిసరాల్లో నమోదైన హైవే దోపిడీలు, నేరాలు/నేరపూరిత ఘటనలపై సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని యజమానులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని సంస్థల్లో అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, ముఖ్యంగా డయల్ 112ను, ప్రజలకు స్పష్టంగా కనిపించే పలు ప్రదేశాల్లో ప్రదర్శించాలని కమిషనర్ ఆదేశించారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తి, వాహనం లేదా కార్యకలాపం కనిపించిన వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలన్నారు. రెస్టారెంట్లు, ధాబాల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, హైజీన్‌ను తప్పనిసరిగా పాటించాలని సీపీ సూచించారు. కస్టమర్ సర్వీస్, అత్యవసర స్పందన, అగ్నిమాపక భద్రత, రహదారి భద్రత, సెక్యూరిటీ జాగ్రత్తలపై సిబ్బందికి క్రమం తప్పకుండా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంస్థల యజమానులకు సూచించారు. నిర్దేశిత భద్రత, సెక్యూరిటీ, ట్రాఫిక్, పరిశుభ్రత, అగ్నిమాపక భద్రత, చట్టపరమైన నిబంధనలను నిరంతరం పాటిస్తూ, పోలీసులకు సహకరించే సంస్థల యజమానులను ఫ్యూచర్ సిటీ పోలీసులు గుర్తించి, ప్రోత్సహించి, సత్కరిస్తుందని డా తరుణ్ జోషి, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె, నారాయణ రెడ్డి, డీసీపీ, మహేశ్వరం, శ్రీ యోగేష్ గౌతమ్, డీసీపీ, చేవెళ్ల, శిరీష, డీసీపీ, షాద్‌నగర్, శివం ఉపాధ్యాయ్, డీసీపీ (ట్రాఫిక్), ఫ్యూచర్ సిటీ కమిషనరేట్, సీనియర్ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో త్వరితగతిన రోడ్ల విస్తరణ పనులు పూర్తి

- దసరా నాటికి నూతన రోడ్ల నిర్మాణం బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణానికి ప్రధాన రహదారిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు దసరా నాటికి పట్టణవాసులకు కానుకగా నూతన రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు పేర్కొన్నారు. దశలవారీగా నిర్మాణంలో కొనసాగించేందుకు బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి నుండి ఏఎంసి చౌరస్తా వరకు మొదటి దశలో, రెండవ దశలో ఏఎంసీ చౌరస్తా నుండి కాంటా చౌరస్తా వరకు ,అదేవిధంగా జిఎం కార్యాలయానికి వెళ్లే బాపు చౌరస్తా నుండి పోచమ్మ టెంపుల్ చౌరస్తా వరకు రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. రోడ్లకు రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఐదు మండలాలకు కేంద్రంగా ఉన్న బెల్లంపల్లి పట్టణం లోని పోచమ్మ టెంపుల్ వద్ద ఉన్న చౌరస్తాను. అభివృద్ధి చేస్తామని ఆమె వెల్లడించారు. రోడ్డు విస్తరణ పనులలో ఇండ్లను కోల్పోయిన వారికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు రోడ్ల నిర్మాణానికి పట్టణ ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు .ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వ్యవసాయ కమిటీ చైర్మన్ కారకూరి రామచందర్ తో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి మహా** :బెల్లంపల్లి పట్టణంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచనలతో బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం నాడు కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశం పురోగతి సాధించేందుకు దేశ ప్రధానిగా వ్యవహరించిన కాలంలో రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశాడని,ఆధునిక భారత నిర్మాణానికి యువతను భాగస్వామ్యం చేసిన దార్శనికుడని,దేశంలో కంప్యూటర్, టెలికమ్యూనికేషన్, సాంకేతిక రంగాల అభివృద్ధికి బలమైన పునాది వేశారని,18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించడం ద్వారా యువతకు ప్రజాస్వామ్యంలో మరింత భాగస్వామ్యాన్ని అందించారని,విద్య, విజ్ఞానం, సాంకేతికత, గ్రామీణాభివృద్ధి, పరిపాలనలో ఆధునిక మార్పులకు ప్రాధాన్యత ఇచ్చారుని,భారతదేశాన్ని 21వ శతాబ్దం లోకి నడిపించిన వ్యక్తి దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని,నవోదయ విద్యాలయాలు, ఆధునిక భారతదేశం, అనుసంధానిత భారతదేశం ఆధునిక భారతదేశాన్ని కలలుగన్న మహా నాయకుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మత్తమారి సూరిబాబు, రాష్ట్ర టీపీసీసీ మెంబర్ చిలుముల శంకర్, కౌన్సిలర్లు చింతల వసంత, జంగం కల్పన, మంచిర్యాల జిల్లా మీడియా కన్వీనర్ దేవసాని ఆనంద్, సీనియర్ నాయకులు, 34 వార్డుల కార్యకర్తలు, మహిళా నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే గల్లా మాధవి



**గుంటూరు:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపైగుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీలో గళమెత్తారు. ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల చిరకాల డిమాండ్ అయిన ఇళ్ల స్థలాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, జర్నలిస్టుల తరపున గళమెత్తిన ఎమ్మెల్యే గల్లా మాధవికి వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆమె చేసిన ఈ ప్రయత్నాన్ని సంఘాల నాయకులు అభినందించారు.

# స్థానిక సంస్థల అదనం కలెక్టర్ సుడిగాలి పర్యటన




**వలిగొండ ఆగస్టు 20 మహా న్యూస్ :** వలిగొండ మండలంలోని వేములకొండ, అర్రూర్ గ్రామాల్లో స్థానిక సంస్థల సహాయ కలెక్టర్ ఏ. భాస్కర్ రావు, నేడు మండలంలోవిస్తృతంగా పర్యటించి వైద్య సేవలు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, అంగన్వాడీ సేవలు, చెయూత పించన్లకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా వేములకొండ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (PHC) సందర్శించిన ఏ. భాస్కర్ రావు, ఆసుపత్రి హాజరు రిజిస్టర్లను పరిశీలించి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా, అవసరమైన మందులు తగినంతగా ఉన్నాయా, ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలు, నమోదవుతున్న కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు అవసరమైన మందులు ముందుగానే సమృద్ధిగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.అనంతరం గ్రామంలో ఫారం పాండ్ల కోసం స్థలాల గుర్తింపు, వాటి నిర్మాణ పురోగతి, వర్షపు నీటి నిల్వ కోసం సోక్ పిట్స్, మ్యాజిక్ సోక్ పిట్స్ నిర్మాణంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులోకి వచ్చే వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.తదుపరి అర్రూర్ గ్రామంలో పర్యటించిన ఏ. భాస్కర్ రావు, గ్రామ పంచాయతీకి సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించి పారిశుధ్య నిర్వహణ, మొక్కల పెంపకం, వర్షపు నీటి నిల్వ కోసం అనువైన ప్రదేశాల గుర్తింపు, వాటి నిర్మాణానికి సంబంధించిన పురోగతిని సమీక్షించారు.అనంతరం అర్రూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు, శిశువుల హాజరు, కేంద్రంలో అందుబాటులో ఉన్న స్టాక్, నిల్వ సామగ్రి నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ చిన్నారులతో స్వయంగా మాట్లాడి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి మరియు ఆహారం సక్రమంగా అందుతున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు.తదుపరి అర్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండే సమయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆన్‌లైన్ చెయూత పింఛన్ దరఖాస్తుల నమోదుపై కూడా సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి చెయూత పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళల వివరాలను పరిశీలించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న సమాచారం వాస్తవమా కాదా నిర్ధారించేందుకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు.ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి , , ఏపీఓ టి. పరశురాములు , సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు డి. రమేష్ ఆర్. క్రాంతి వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వేములకొండ గ్రామ సర్పంచ్ ఏ. వెంకటేశం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ సమస్యలను పరిష్కరించండి

- మంత్రికి ఎమ్మెల్యే నాయిని వినతి పత్రం అందజేత



**హనుమకొండ మహా ;** వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల తో పాటు పూర్వ విద్యార్థులు సమర్పించిన వినతిపత్రాన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు, లెక్చరర్లు మరియు పూర్వ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హైదరాబాద్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ని కలిసి అందజేసి, సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు సంబంధించిన జీవో 97 విషయంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు పూర్వ విద్యార్థుల్లో నెలకొన్న అపోహలను నివృత్తి చేసి, స్పష్టత ఇవ్వాలని నాయిని మంత్రివర్యులను కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థ బలోపేతం, విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణ, కళాశాలల అభివృద్ధి, అధ్యాపకుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం సానుకూలంగా చర్యలు తీసుకోవాలని నాయిని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అభివృద్ధి, సాంకేతిక విద్య బలోపేతం మరియు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సానుకూల దృక్పథంతో చర్యలు తీసుకుంటుందని నాయిని రాజేందర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.




# కరీంనగర్ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

- సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి: సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ మహా :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. మొత్తం 34 మంది ప్రతినిధుల నుంచి 13 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు.నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఏ. సతీష్, పీసీ 3108 ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా బి. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బి. వంశీకృష్ణ, ఎస్ఐ ఆఫ్ పోలీస్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సీహెచ్. నర్సింహారావు, ఎస్ఐ, సంయుక్త కార్యదర్శిగా ఏ. శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ 2166, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జె. ఓదయ్య, పీసీ 3514, కోశాధికారిగా ఆర్. చంద్ర మౌళి, పీసీ 1834 ఎన్నికయ్యారు. యూనిట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎం. ప్రవీణ్ రెడ్డి (ARPC 2868), వి. మల్లేశం (ARHC 2612), బి. శ్రీధర్ (PC 3302), ఏ. తిరుపతి (PC 626), కె. మహేష్ (PC 3018), వి. శైలజ (WPC 576) ఎన్నికయ్యారు.పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా బాధ్యతాయుతంగా పనిచేస్తామని పేర్కొన్నారు.



# ఈఎస్ఐ ఆసుపత్రిలో నర్సింగ్ అధికారులకు స్వాగతం–వీడ్కోలు

**కుషాయిగూడ, మహా:** ఈఎస్ఐ ఆసుపత్రి, నాచారంలో నూతనంగా విధుల్లో చేరిన నర్సింగ్ అధికారులకు స్వాగతం, ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన నర్సింగ్ అధికారులకు వీడ్కోలు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాచారం విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సుమారు 150 మంది నూతన నర్సింగ్ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది హాజరయ్యారు.యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్. మూర్తి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింహ, టీజీడీడీఏ ఈఎస్ఐ విభాగం అధ్యక్షుడు డా. శ్రీనివాస్, టీఎన్‌జీవో ఈఎస్ఐ అధ్యక్షుడు వాసు, టీఎన్‌జీవో ఐఎంఎస్ ఫోరం అధ్యక్షుడు సీనయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ప్రేమలత, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వి. వేణు కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన తొమ్మిది మంది నర్సింగ్ అధికారులను శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో సత్కరించి వీడ్కోలు పలికారు. నూతనంగా విధుల్లో చేరిన నర్సింగ్ అధికారులను కూడా సన్మానించి అభినందించారు. రోగులకు అంకితభావంతో, నిజాయితీగా సేవలందిస్తూ ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని నాయకులు సూచించారు.శాఖ అధ్యక్షురాలు జి. విక్టోరియాతో పాటు అరుణ, చంద్రకళ, రాణి, భాగ్య, శ్రీలత, అంజని, కల్పన, రుద్రమదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ ప్రతినిధులు సంతోష్, రఘు, నర్సింగరావు, రమేష్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.









# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రతిష్ట చర్యలు

- సమస్యలు లేని జిల్లాగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలి
- అట్రాసిటీ కేసుల పై ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**వరంగల్, బ్యూరో మహా :** ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, ఆర్ఓఆర్, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా అధికారులు ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఆయా వర్గాల ఆవాసాలు, సంక్షేమం, అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని, నిధులను పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, కుసుమ నీలా దేవిలతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సీపీ శ్వేత, డీసీపీ అంకిత్ కుమార్, ఐటీడీఏ పీవో లెనిన్ వాత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై.వి.గణేష్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, ఆర్ఓఆర్, ఉద్యోగుల పదోన్నతులు, రోస్టర్ రిజర్వేషన్లు, ఉప ప్రణాళిక నిధుల వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు.
ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇచ్చిన "సమీకరించు..బోధించు.." అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఎస్సీ, ఎస్టీలకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.
ప్రజల సమస్యలను కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**అట్రాసిటీ కేసుల పై ప్రత్యేక దృష్టి**

ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిని సమీక్షించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్ తప్పనిసరి**

ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు నియమకాలు మరియు పదోన్నతులు , కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. రిజర్వేషన్ అమలులో నిర్లక్ష్యం చేయకూడదని, ఉద్యోగుల రాజ్యాంగపరమైన హక్కులకు భంగం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డే**

ప్రతి నెల గ్రామస్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని చైర్మన్ ఆదేశించారు. తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, సంక్షేమ పథకాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కమిషన్ సూచించిన విధంగా సివిల్ రైట్స్ డే రోజున అధికారులు తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా సహపంక్తి భోజనం ఏర్పాటు చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తామని చెప్పారు.సీపీ శ్వేత మాట్లాడుతూ జిల్లాలో కేసుల నియంత్రణ, పరిష్కారంలో పోలీసు యంత్రాంగం ముందుండి పని చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాల కేసుల్లో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ**

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చైర్మన్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.విదేశీ విద్య, బాధితులకు పరిహారం, కులాంతర వివాహాల ప్రోత్సాహక చెల్లింపులకు సంబంధించి పెండింగ్ వివరాల నివేదికను అందించాలని ఎస్సీ అభివృద్ధి అధికారిని ఆదేశించారు.

**బాధితులకు పరిహారంతో పాటు పునరావాసం**

హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతో వదిలేయకుండా పునరావాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. అర్హులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు**

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో పథకాల అమలును పర్యవేక్షించాలని సూచించారు.
అనంతరం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రజల నుంచి గ్రీవెన్స్‌లను స్వీకరించారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులకు జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, డీబీసీడీఓ, ఇన్‌చార్జ్ డీఎస్సీడీఓ పుష్పలత, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు భూక్య హుస్సేన్ నాయక్, పాలకుర్తి విజయ్ కుమార్, బిర్రు మహేందర్, మహంకాళి యాదగిరి, రైతు రమేష్ కుమార్, వాసం సాంబయ్య, రాజేందర్, నమిడ్ల చిన్నస్వామి, కల్లెపు శోభారాణి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# పూటకో పార్టీ మారిన వారికి కాంగ్రెస్ ను విమర్శించే హక్కు లేదు

- సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు
- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**వరంగల్, బ్యూరో మహా ;**పూటకో పార్టీ మారినట్లు పది పార్టీలు మారిన వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. గురువారం ఎంజీఎం సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతూ కొండా కుటుంబం పై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

**కాంగ్రెస్ జెండాను మోసిన వారికి గుర్తింపు ఏది**

బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి, కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు ప్రస్తుతం ఎలాంటి రాజకీయ అవకాశం, గుర్తింపు దక్కిందో చెప్పాలని అయూబ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ కోసం కష్టపడిన వారికా.. లేక అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అంటూ వర్గీకరించిన వారికా అవకాశాలు కల్పించారో స్పష్టం చేయాలని అన్నారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కొంతమంది బహిరంగ వేదికల పై ఇష్టం వచ్చినట్లు అవమానిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అదే వేదిక పై ఎలా కొనసాగుతారని అయూబ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.మేము ఐదుగురిని గెలిపించాం అని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన అయూబ్, 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి పరకాల నియోజకవర్గంలో పోటీ చేసిన వారు 2023లో కూడా పరకాల నుంచే పోటీ చేసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదేమో కదా అని వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలు**

కాంగ్రెస్ పార్టీ కొండా సురేఖ కు అనేకసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా అవకాశం కల్పించిందని, అలాగే కొండా మురళి కి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తన నాయకులు, కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూనే ఉందన్నారు.పార్టీలో టికెట్ ఆశించే వారికి, తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే వారికి పార్టీ అంతర్గతంగా ఒక విధానం ఉంటుందని, బహిరంగ వేదికల పై పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని మహమ్మద్ అయూబ్ అన్నారు.
ఇలాంటి వ్యాఖ్యల వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఈ అంశం పై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవడంతో పాటు, పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కోరారు.

# టీచర్ మందలింపుతో ఆరేళ్ల విద్యార్థి మృతి

- జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఘటన

**విశాఖపట్టణం, మహా :** పాఠశాలలో టీచర్ మందలించడంతో ఆరేళ్ల విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ జిల్లాలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకుంది. విశాఖ జిల్లాలో ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థి రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లాడు. హోంవర్క్ చేయకపోవడంతో విద్యార్థి వినయ్ తేజ్ ను టీచర్ మందలించింది. ఇది జరిగిన కొద్ది సేపటికే విద్యార్థి గుక్కపెట్టి ఏడుస్తూ కుప్పకూలి పోయాడు. టీచర్ ఒడిలోనే పడిపోగా వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే విద్యార్థి వినయ్ తేజ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు హుటాహుటిన స్కూలుకు వెళ్లారు. బోరున విలపించారు. టీచర్ కొట్టడం వల్లనే తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపించారు. పాఠశాల వద్ద ఆందోళన చేశారు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దాంతో పోలీసులు టీచర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాఫిక్ సమస్యలను సమన్వయంతో పరిష్కరిద్దాం

- సంబంధిత శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న తో కలిసి ట్రాఫిక్ సమస్యల పై సీపీ సమీక్ష




**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు.ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై గురువారం పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, ఎన్‌హెచ్ఏఐ పీడీ భరద్వాజ్‌తో పాటు ఆర్అండ్‌బీ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో నగరంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ట్రాఫిక్ పోలీసులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్ల పనితీరు, వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో కొత్తగా సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన జంక్షన్లు, రోడ్లపై ఆక్రమణలు, తొలగించాల్సిన టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్డు మరమ్మతులు, యూటర్న్ ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు, ఆటో స్టాండ్లకు అనువైన ప్రాంతాల గుర్తింపు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ట్రైసిటీ పరిధిలో రాత్రి సమయాల్లో తగినంత వెలుతురు లేని 159 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రోడ్డు మలుపులు, అనధికార పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు సంభవించే అవకాశమున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ అధికారులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సమన్వయంతో పనిచేస్తే ట్రాఫిక్ సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చోట్ల రోడ్ల అభివృద్ధి, సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుదల, పార్కింగ్ సౌకర్యాలు, ఆక్రమణల తొలగింపు, రోడ్డు భద్రతా చర్యలను సమన్వయంతో అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ విభాగం అధికారులు, ట్రైసిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఐటీ కోర్, టి.టి.ఐ. ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహా పత్రిక



WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 21-08-2026



# ‘వారణాసి’లో ఆరు పాటలేనా?

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘వారణాసి’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ గ్లింప్స్, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ చిత్రానికి లెజెండరీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. తాజాగా ‘వారణాసి’ మ్యూజిక్ ఆల్బమ్‌పై కీరవాణి చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉండనున్నాయని ఆయన వెల్లడించినట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ‘రణ కుంభ’, ‘సంచారి’ పాటలు మంచి స్పందనను అందుకోవడంతో పాటు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. అయితే కీరవాణి చెప్పిన ఆరు పాటల విషయంలో అభిమానుల్లో సందేహం మొదలైంది. ఇప్పటికే విడుదలైన ‘రణ కుంభ’, ‘సంచారి’ పాటలను కలుపుకుని మొత్తం ఆరు పాటలా? లేక ఈ రెండు పాటలకు అదనంగా మరో ఆరు పాటలు ఉండనున్నాయా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై చిత్రబృందం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. రాజమౌళి సినిమాల్లో సంగీతానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆయన విజన్‌కు కీరవాణి సంగీతం తోడైతే పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తాయి. ‘వారణాసి’ విషయంలోనూ ఇదే స్థాయిలో మ్యూజికల్ ట్రీట్ ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. మహేష్‌బాబు, రాజమౌళి కలయికకు కీరవాణి సంగీతం తోడవడంతో ‘వారణాసి’పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో మహేష్‌బాబుకు జోడీగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా నటిస్తుండగా.. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం.

స్విమ్మింగ్ పూల్ వద్ద

# మోనామి ఘోష్ గ్లామర్ లుక్

ప్రముఖ బెంగాలీ నటి మోనామి ఘోష్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. స్విమ్మింగ్ పూల్ వద్ద గ్లామరస్ లుక్‌లో కనిపించిన ఆమె ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. గ్రీన్ కలర్ రిబ్డ్ స్విమ్‌సూట్, ఓవర్‌సైజ్డ్ బ్లాక్ సన్‌గ్లాసెస్‌తో మోనామి స్టైలిష్‌గా పోజిచ్చారు. జుట్టును సింపుల్‌గా స్లీక్ బన్‌లో కట్టుకుని, పూల్ అంచున కూర్చున్న ఆమె లుక్ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. ఎండలో మెరిసే నీటి బిందువులు, చుట్టూ ఉన్న పామ్ చెట్లు, గొడుగులతో కూడిన ఔట్‌డోర్ వాతావరణం ఫొటోకు మరింత గ్లామర్‌ను తీసుకొచ్చాయి. మోనామి ఘోష్ పశ్చిమ బెంగాల్‌లోని బసిర్‌హాట్‌లో జన్మించారు. కేవలం 17 ఏళ్ల వయసులోనే నటిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. డీడీ బంగ్లా సీరియల్ ‘సాత్ కహోన్’తో బుల్లితెరపై అడుగుపెట్టిన ఆమె.. ఆ తర్వాత వరుసగా పలు విజయవంతమైన బెంగాలీ టెలివిజన్ సీరియల్స్‌లో నటించారు. ‘ప్రతీక్ష ఏక్తు భాలోబాషార్’లో అనన్య, ‘ఏక్‌దిన్ ప్రతీదిన్’లో బర్షా పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 2009 నుంచి 2013 వరకు ప్రసారమైన ‘బిన్నీ ధానెర్ ఖోయ్’ సీరియల్‌లో మోహర్ పాత్ర మోనామికి భారీ క్రేజ్ తీసుకొచ్చింది. ఈ పాత్రతో ఆమె బెంగాలీ టెలివిజన్ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అనంతరం ‘పుణ్యి పుకూర్’, ‘ఇరాబోతిర్ చుప్‌కథా’ వంటి సీరియల్స్‌లోనూ తన నటనతో మెప్పించారు. బుల్లితెరతో పాటు వెండితెరపైనా మోనామి ఘోష్ తనదైన ముద్ర వేశారు. ‘బాక్స్ నంబర్ 1313’ (2009), ‘భూతేర్ భవిష్యత్’ (2012), ‘బెలా శేషే’ (2015), ‘మాటి’ (2018), ‘బెలాశురు’ (2022) వంటి చిత్రాల్లో నటించారు. 2024లో విడుదలైన ‘పడాటిక్’ సినిమాలో గీతా సేన్ పాత్రలో కనిపించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. 2025లో మోనామి ఘోష్ ‘విటమిన్ ఎం ఎంటర్‌టైన్‌మెంట్’ పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. అదే ఏడాది ‘కల్కి’ అనే పూజా మ్యూజికల్‌లోనూ నటించారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న మోనామి.. సోషల్ మీడియాలోనూ ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అప్‌డేట్స్‌ను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. దీంతో బెంగాలీ సినిమా, టెలివిజన్ రంగాల్లో మోనామి ఘోష్ ఇప్పటికీ తన ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తున్నారు.







# ఒకే ఫ్రేమ్‌లో అక్కినేని మూడు తరాలు

అక్కినేని కుటుంబానికి చెందిన మూడు తరాల నటులు ఒకే ఫ్రేమ్‌లో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. కింగ్ నాగార్జున, యువ హీరోలు నాగచైతన్య, అఖిల్ అక్కినేని కలిసి ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ‘వెరైటీ ఇండియా’ కవర్‌పై మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జున తన సినీ ప్రయాణంతో పాటు కుమారుల కెరీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తన కెరీర్‌లో ‘గీతాంజలి’ చిత్రం కీలక మలుపుగా నిలిచిందని నాగార్జున గుర్తుచేసుకున్నారు. మణిరత్నం దర్శకత్వంలో 1989లో తెరకెక్కిన ఈ సినిమాను చేయడం అప్పట్లో తాను తీసుకున్న సాహసోపేత నిర్ణయాల్లో ఒకటని చెప్పారు. విభిన్నమైన కథతో వచ్చిన ఆ చిత్రాన్ని స్వీకరించడం తన కెరీర్‌కు కొత్త దిశను చూపించిందన్నారు. అప్పట్లో ఇలాంటి ప్రయోగాత్మక కథలను ఎంచుకునేందుకు పలువురు స్టార్ హీరోలు ఆసక్తి చూపించలేదని తెలిపారు.తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా కెరీర్‌లో కొత్తదనం కోసం ప్రయత్నించాలని నాగార్జున సూచించారు. మూసధోరణి కమర్షియల్ కథలకే పరిమితం కాకుండా విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటే నటులుగా మరింత ఎదగవచ్చని చెప్పారు.అయితే ప్రస్తుత పరిస్థితుల్లో హీరోలు రిస్క్ తీసుకోవడం గతంతో పోలిస్తే కష్టంగా మారిందని నాగార్జున అభిప్రాయపడ్డారు. 1990లలో వరుసగా కొన్ని సినిమాలు విఫలమైనా హీరోలు తిరిగి విజయాన్ని అందుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం మాత్రం ప్రేక్షకుల అభిరుచులు వేగంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఒక హీరో సినిమా వరుసగా విఫలమైతే ప్రేక్షకులు మరో నటుడి వైపు మళ్లే పరిస్థితి ఉందని తెలిపారు.నాగార్జున చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. మూడు తరాల అక్కినేని హీరోలు ఒకే మ్యాగజైన్ కవర్‌పై కనిపించడం అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

# ప్రభాస్ దర్శకులతో మళ్లీ సినిమాలా?



ఒక దర్శకుడితో సినిమా పూర్తయిన తర్వాత అదే డైరెక్టర్‌తో ప్రభాస్ మరోసారి పనిచేయడం కొత్తేమీ కాదు. ‘ఛత్రపతి’ తర్వాత ఎస్ఎస్ రాజమౌళితో ‘బాహుబలి’ చేసి పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించారు. అయితే ప్రస్తుతం ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో.. ఆయనతో మరో సినిమా చేయాలంటే దర్శకులకు కథతో పాటు డేట్స్ కూడా కీలకంగా మారుతున్నాయి.

ప్రభాస్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన ‘సలార్’ మంచి విజయాన్ని అందుకుంది. ఈ చిత్రానికి కొనసాగింపుగా ‘సలార్: శౌర్యాంగ పర్వం’ తెరకెక్కాల్సి ఉంది. అయితే ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉండటం, ప్రశాంత్ నీల్ ఇతర కమిట్‌మెంట్ల కారణంగా సీక్వెల్ విషయంలో కొంత గ్యాప్ ఏర్పడింది. ఇప్పుడు ఈ పార్ట్ 2పై మళ్లీ పనులు జరుగుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో సినిమా విజయవంతమైందని వెంటనే సీక్వెల్ షూటింగ్ ప్రారంభమవుతుందనే పరిస్థితి లేదని స్పష్టమవుతోంది.

మరోవైపు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘కల్కి 2898 ఏడీ’ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ సినిమాకు సీక్వెల్ ఆలోచన మొదటి నుంచే కథలో భాగంగా ఉండటంతో.. తొలి చిత్రం భారీ విజయం సాధించిన తర్వాత పార్ట్ 2 పనులు కొనసాగుతున్నాయి. ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ ‘కల్కి’ సీక్వెల్ ఆయన లైనప్‌లో కొనసాగుతోంది.

ఇక మారుతి దర్శకత్వంలో వచ్చిన ‘ది రాజా సాబ్’లోనూ రెండో భాగానికి సంబంధించిన హింట్ కనిపించింది. అయితే సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో సీక్వెల్‌పై ప్రస్తుతం పెద్దగా చర్చ జరగడం లేదు.

తాజాగా దర్శకుడు హను రాఘవపూడితోనూ ప్రభాస్ మరోసారి సినిమా చేసే అవకాశం ఉందనే ప్రచారం మొదలైంది. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్‌లో ‘ఫౌజీ’ తెరకెక్కుతోంది. ఈ సినిమా షూటింగ్ సమయంలో హను పనితీరు ప్రభాస్‌కు నచ్చిందని, భవిష్యత్‌లో మరో ప్రాజెక్ట్ గురించి ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇదే కథకు ప్రీక్వెల్ చేసే ఆలోచన కూడా ఉందనే ప్రచారం ఉంది. అలాగే హోంబలే ఫిలిమ్స్ నిర్మాణంలో మరో సినిమా చేసే అవకాశం ఉందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ప్రస్తుతం ‘ఫౌజీ’పై అంచనాలు భారీగా ఉన్నాయి. పీరియడ్ యాక్షన్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గ యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలను హను రాఘవపూడి ఎలా చూపిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. సినిమా విజయం సాధిస్తే హను రాఘవపూడికి మరిన్ని పాన్ ఇండియా అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.



# రామ్‌చరణ్ సరసన సారా అర్జున్?

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ‘RC17’పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన ‘రంగస్థలం’ ఘన విజయం సాధించడంతో.. ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే అంశంపై కొత్త ప్రచారం మొదలైంది.‘ధురంధర్’ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న నటి సారా అర్జున్ ‘RC17’లో కథానాయికగా నటించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో ఈ పాత్ర కోసం కియారా అద్వానీ పేరు వినిపించింది. ఒక దశలో సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండొచ్చనే వార్తలు కూడా వచ్చాయి. అయితే తాజాగా సారా అర్జున్‌ను ప్రధాన కథానాయికగా ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే సమయంలో సినిమాలో ఓ కీలక పాత్ర కోసం లేడీ సూపర్‌స్టార్ నయనతారను సంప్రదించినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపైనా ఇప్పటివరకు అధికారిక సమాచారం వెలువడలేదు. మరోవైపు సుకుమార్ ‘RC17’ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉందని టాక్. రామ్‌చరణ్ తన సర్జరీ అనంతరం పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన తర్వాత నవంబర్ 2026 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే అవకాశాలున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మైత్రి మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో రూపొందనుందని సమాచారం. ‘RC17’ను రెండు భాగాలుగా కాకుండా ఒకే భాగంగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. 2027 చివర్లో లేదా 2028 వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు టాక్. ‘రంగస్థలం’ తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ మరోసారి జతకడుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

# సూర్య మానసిక పోరాటం.. రాధిక సంచలన వ్యాఖ్యలు

తమిళ స్టార్ హీరో సూర్య తెరపై ఎంత శక్తివంతంగా కనిపిస్తారో.. వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారని ప్రముఖ నటి రాధిక శరత్‌కుమార్ తెలిపారు. సూర్య ఎదుర్కొన్న మానసిక ఒత్తిడి, కెరీర్‌లోని ఒడిదుడుకుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి.సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కిన ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సక్సెస్ మీట్‌లో రాధిక మాట్లాడారు. ఈ సందర్భంగా సూర్య ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. బయటికి సెలబ్రిటీల జీవితం ఎంతో అందంగా, సౌకర్యవంతంగా కనిపించినప్పటికీ.. తెరవెనుక వారు ఎదుర్కొనే ఒత్తిళ్లు, మానసిక సంఘర్షణలు అంతకంటే ఎక్కువగా ఉంటాయని రాధిక పేర్కొన్నారు.సినిమాలపై ఉండే భారీ అంచనాలు, ఫలితాల ప్రభావం నటులపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయని ఆమె అన్నారు. కెరీర్‌లో క్లిష్ట పరిస్థితులు ఎదురైన సమయంలో సూర్య కూడా మానసికంగా ఎంతో ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఆ పరిస్థితులను అధిగమించేందుకు ఆయన ఎంతో అంతర్గత పోరాటం చేశారని రాధిక వెల్లడించారు. సూర్య ప్రతి సినిమాను ఎంతో బాధ్యతగా తీసుకుంటారని, పాత్ర కోసం పూర్తిగా అంకితమవుతారని రాధిక ప్రశంసించారు. అయితే ఎంత ప్రతిభావంతుడైన నటుడికైనా అనుకున్న ఫలితం రాకపోతే బాధ తప్పదని అన్నారు. అలాంటి సందర్భాల్లో సూర్య ఎదురైన కష్టాలను అధిగమించి మళ్లీ విజయాల బాట పట్టడం ఆయన మానసిక ధైర్యానికి నిదర్శనమని కొనియాడారు.‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విజయంతో సూర్య మరోసారి తన సత్తా చాటారని రాధిక అన్నారు. ఎన్నో ఒడిదుడుకులను దాటి సాధించిన ఈ విజయం తనకు ప్రత్యేకంగా అనిపిస్తోందని తెలిపారు. ఈ సక్సెస్ సూర్యకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చి.. భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలు చేయడానికి ప్రేరణగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com